3.4.1998 శుక్రవారం 12 పేజీలు సంపుటి: 70 సంచిక: 14 విక్రయ ధర: రూ. 2.00లు Phone: 327354 Regd. No. HNL 18

జిందాతిలిస్మాత్

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

జిందాతిలిస్మాత్

మీ వ్యాపారాభివృద్ధికి సులువైన సాధనం

ప్రకటన రేట్లు

కాలం సెం.మీ. .....రూ. 30.00

మొదటి పేజీ .....100% అదనం

ఆఖరు పేజీ .....50 % అదనం

వెంకయ్య నాయుడి భవిష్యత్ ప్రశ్నార్థకమేనా?

కమ్మవారి కెవరికీ మంత్రిపదవులు ఇవ్వవద్దు!

గుజ్రాల్, దేవగౌడల కాలంలో వలె వాజ్‌పేయి ప్రభుత్వాన్ని సైతం తన చేతిలో కీలుబొమ్మ వలె ఆడిస్తున్నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు. తన పదకొండు ఓట్లు మృత సంజీవని వలె పనిచేసి ఢిల్లీ సర్కారుకు వూపిరి నిల్పాయి కాబట్టి తాను చెప్పినట్లే నడవాలని హుకుం జారీచేస్తున్నాడు చంద్రబాబు. 540 మంది సభ్యులున్న లోక్‌సభలో పదకొండు మంది ఎమ్పీలంటే - సాధారణ పరిస్థితులలో ఎక్కడో ఒక మూల సర్దుకొని కూర్చుని అనామకంగా వుండి పోవాలి. అది రాజకీయ విచిత్ర మనండి, చంద్రబాబు జాతకం అనండి - ఆ నామమాత్ర బలమే ఇప్పుడు హిమ వత్పర్వత సమ శక్తివంతమై పోయింది. ఆ పరిస్థితిని ఎంతో నేర్పుగా, నైపుణ్యంగా చాకచక్యంగా తన రాజకీయ ప్రయోజనాలకు వాడు కొంటున్నాడు ముఖ్యమంత్రి.

వాజ్‌పేయికి చంద్రబాబు కఠిన షరతు!

జయలలిత, రామకృష్ణహెగ్డే, మమతా బెనర్జీ వంటి వారూ వాజ్‌పేయిని ఇదే తీరులో రక్షించిన మాట నిజమే; అయితే వారు ఆ అవకాశాన్ని తమ రాష్ట్ర ప్రయోజనాలకు వాడుకొంటున్నారు. ఈశాన్య భారత రాష్ట్రాల నుంచి 300 మెగావాట్ల విద్యుత్ మర్గింపజేసి తమిళనాడులో కరెంట్ కోత అన్నది లేకుండా చేసింది జయలలిత. పశ్చిమబెంగాల్ తుఫాన్ బాధితులకు ఆఘమేఘాల మీద కేంద్ర సహాయం తరలింప జేసింది మమత. కాని చంద్రబాబు అటువంటి పనికిమాలిన, ప్రజలకుపయోగపడే పనులకు తన పలుకుబడిని వృధా చేసుకోదల్చ లేదు. విశ్వాస తీర్మానానికి అనుకోకుండా ఓటు వేసినందుకు ఆయన వాజ్‌పేయిని కోరిన కోరికలలో ప్రధానమైనది - ఆంధ్రకు చెందిన కమ్మ కులస్థులెవరికీ ఢిల్లీ సర్కారులో మంత్రి

తొరవ 11వ పేజీలో

ఇంటింటికీ సారా సీసా ఆడపడచులకు తెలుగు నేతల ఉగాది కానుక!

నూతన ఎక్సైజ్ విధానం పేరిట రాష్ట్రంలో విచ్చల విడిగా మద్యం దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేసి సారా వరదకు గేట్లు బార్లా తెరిచాడు ముఖ్యమంత్రి. లైసెన్స్ ఫీజు కట్టడానికి సిద్ధపడే వారికెవరికైనా బ్రాందీ షాపు పెట్టుకోవడానికి అనుమతి ఇచ్చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో.. అదేదో వీధి కొల్లబోతే మగధీరులందరూ పంచె లెగబట్టు కొని పరుగెత్తినట్లు సారా వ్యాపారులు వేలం వెర్రిగా ఎగబడ్డారు. పల్లె పట్టణం అనే తేడా లేకుండా పందలు, వేల సంఖ్యలో బ్రాందీ అంగళ్లు ప్రత్యక్షమై పోయాయి. సారా వ్యాపారులపై ఇది వరకు వుండిన ఆంక్షలన్నిటినీ తొలగించి పారేశాడు ముఖ్యమంత్రి. సంవత్సరం పాడవునా అంగళ్లు తెరుచుకోమన్నాడు. డ్రైడేలు, బీటాలు

ప్రతి వూరూ ఒక కల్లు కాంపౌండ్‌గా మారిపోతూంది!

పచ్చేరోజు అమ్మకాలను బండ్ పంటి నిబంధనలు తొలగించి పారేశాడు. రాత్రి పదకొండు గంటల వరకు అంగడి తెరిచినా, అర్ధరాత్రి అమ్మకాలు చేసినా పోలీసులు

తొరవ 7వ పేజీలో

KORA

INSTITUTE OF ENGINEERING & MEDICAL ENTRANCE COACHING

For **EAMCET-1998** (English Medium only) **Engineering & Medical** short term batch will commence from **6-4-'98 to 12-5-'98** (36 days) for I.C.S.E. & C.B.S.E. and Long Term Students. For application and prospectus send **Rs.50/-** by **M.O.** only. Limited hostel facility is available for both Boys & Girls.


KORA INSTITUTE

SARASWATHI NAGAR, NELLORE-3.

Phone: 321346, 321347, 321351

మ్యానిఫెస్టో మూలపారేసి మాయమాటలు చెప్తున్నారు!

లోక్‌సభ తొలి సమావేశంలోనే కాంగ్రెస్ పక్షాన ప్రసంగించే ఛాన్సు సంపాదించారు మాజీ ముఖ్యమంత్రి శ్రీ ఎన్. జనార్దనరెడ్డి. లోక్‌సభ సభ్యత్వం కూడా ఆయన కిదే ప్రథమం. మొదటిసారి ఎన్నికైన సభ్యులకు సాధారణంగా పార్లమెంట్ చర్చల్లో పాల్గొనే అవకాశం లభించదు.



రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెల్పే తీర్మానంపై మాట్లాడారు శ్రీ ఎన్. జనార్దనరెడ్డి. సుదీర్ఘమైన ఈ ఉపన్యాసంలో జాతీయ ప్రాధాన్యత కల్గిన పలు అంశాలు ప్రస్తావించారాయన. కొత్తగా అధికారంలోకి వచ్చిన ఏ ప్రభుత్వమైనా రాష్ట్రపతి ప్రసంగం ద్వారా తన ఎన్నికల మ్యానిఫెస్టో ప్రకారం తాను చేపట్టబోయే పథకాలను వివరించడం సాంప్రదాయం. కాని బిజెపినేతలు తమ మ్యానిఫెస్టోను ప్రక్కన పెట్టి, మిత్రపక్షాల కోసం రూపొందించిన జాతీయ అజెండా కార్బన్ కాపీ ప్రతిని రాష్ట్రపతి చేత చదివింప చేశారు. గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రపతి ప్రసంగం కోసం తయారు చేసిన ప్రతులలో నుంచి చాలా భాగాలు ఇందులో కాపీ కొట్టినట్లు కన్పడుతూంది. ఇందులో వారు వాడిన మధురమైన భాష, అరచేతిలో స్వర్గం చూపినట్లుగా చేసిన వాగ్దానాలు వినేవారికి ఆనందం కల్గిస్తున్నాయి. కాని అవేవీ ఆచరణ సాధ్యం కావన్న సంగతి అందరికీ తెలుసు. వాజ్‌పేయి గారికీ తెలుసు.

బిజెపి తన ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ఆర్టికల్ 370 రద్దు; కామన్ సివిల్ కోడ్ వంటి వాటిని ప్రస్తావించింది; కాని ఈ రాష్ట్రపతి ప్రసంగంలో వాటి ఊసే లేదు. ఎన్నికలలో ఒక మాట చెప్పి, ఆ తర్వాత మరొక మాట చెప్పడం ఇప్పుడు బిజెపికి స్నేహితులుగా మారిన తెలుగుదేశం నేతలకు బాగా అలవాటు; కిలో రెండు రూపాయల బియ్యం, మద్యపాన నిషేధం వంటి వాటిపై వారు చేసిన వాగ్దానాలు ఎన్నికల తర్వాత ఏమైంది వాజ్‌పేయికీ తెలుసు. ఆంధ్ర ప్రజానీకాన్ని తెలుగుదేశం దగా చేసిన తీరులోనే, భారత జనావళిని బిజెపి వంచిస్తున్న దిప్పుడు.

నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు చేస్తామని బిజెపి చెప్తున్నది. కాలేజి వరకు మహిళలకు ఉచిత విద్య అందిస్తామంటున్నది. అయితే చదువును ప్రోత్సహించడానికి కేవలం నిధులిస్తే చాలదు. ప్రాథమిక విద్య కేంద్రం పరిధిలోకి రాదు. అది రాష్ట్రాల బాధ్యత. విద్యాభివృద్ధి కోసం రాష్ట్రాలకు నిర్దేశాలు, నిధులు ఇవ్వడం మాత్రమే కేంద్రం చేయాల్సిన పని. అటువంటప్పుడు విద్యను రాష్ట్రాల పరిధి నుంచి తొలగించబోతున్నారా లేక కేంద్ర పథకంగా అమలు చేయనున్నారా లేక రాష్ట్రాల వ్యవహారాలలో తలదూర్చ నున్నారా - ఈ అంశమై సరైన వివరణ లేదు. రాష్ట్రపతి ప్రసంగమే అస్పష్టంగా వుంది.

పార్లమెంట్‌లో నెల్లూరీయుల ప్రసంగాలు

వ్యవసాయ రంగానికి 60 శాతం ప్రణాళికా నిధులు కేటాయించ నున్నట్లు పెద్ద ఘనతగా ప్రకటించు కున్నారు. కాని ఇప్పటికే కేంద్ర ప్రణాళికలో 60 శాతం వ్యవసాయ రంగానికే ఇస్తున్నారు. అందువల్ల దాన్ని మెరుగు పరిచేందుకు ప్రయత్నించాలి. డాక్టర్ బలరాం జక్కర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి కేటాయించే ప్రతి ఎనిమిది రూపాయలలో, కేవలం రూపాయి 75 పైసలు మాత్రమే రైతులకు చేరుతున్నదని చెప్పారు. స్వర్గీయ రాజీవ్‌గాంధీ సైతం గ్రామీణాభివృద్ధికి కేటాయించే ప్రతి వంద రూపాయల నిధులలో కేవలం 17 రూపాయలు గ్రామాలకు చేరుతున్నాయని చెప్పి - దీన్ని నివారించడం కోసం జవహర్ రోజ్‌గార్ యోజన పథకం ప్రవేశపెట్టి, నేరుగా గ్రామాలకు నిధులందించే సాంప్రదాయం ప్రారంభించారు. బిజెపి ప్రభుత్వం సైతం

తొరవ 7వ పేజీలో

బ్యాంకు మేనేజర్లను వేధింపుల నుంచి రక్షిస్తేనే పారిశ్రామికాభివృద్ధి సాధ్యం!

మరొక నెల్లూరు పార్లమెంటేరియన్ డాక్టర్ తిక్కవరపు సుబ్బరామరెడ్డి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చ ప్రారంభించే అరుదైన అవకాశం సంపాదించారు. సీనియర్ నేతలకు, ఫ్లోర్ లీడర్లకు మాత్రమే లభించే ఛాన్సు ఇది. గత లోక్‌సభలో సుబ్బరామరెడ్డి గారి సమర్థత, పార్లమెంటరీ చర్చలలో పాల్గొనడంలో ఆయన చూపిన చొరవ చూసిన కాంగ్రెస్ పార్టీ ఆయనకా అవకాశం ఇచ్చింది.

దేశంలో వాణిజ్యం, పరిశ్రమలు, ఎగుమతులను సత్వరం అభివృద్ధి చేసి, అధిక వనరులు సేకరిస్తే తప్ప బిజెపి ప్రభుత్వం ప్రకటించిన కార్యక్రమాలు ఆచరించడం సాధ్యం కాదు. దారిద్ర్యం, నిరుద్యోగం వంటివి నిర్మూలించి; ఉపాధి అవకాశాలు పెంచి, గ్రామీణాభివృద్ధి సాధించాలంటే అధిక వనరులు కావాలి. అయితే బిజెపి ప్రవేశ పెట్టిన బడ్జెట్ చాలా నిరాశాజనకంగా వుంది. గత ఐదేళ్లలో ఎప్పుడూ లేనంత తక్కువ స్థాయిలో కేవలం 5శాతం జిడిపి పెరుగుదల చూపించారు. 6 శాతం ద్రవ్య లోటు అత్యంత ప్రమాదకరమైనది. 14200 కోట్ల కస్టమ్స్ సుంకాలు సేకరించ లేకపోవడం క్షమార్హం కాదు. దేశంలో ఇప్పుడు పారిశ్రామికాభివృద్ధి చాలా వీరసంగా వుంది. షేర్ మార్కెట్ పూర్తిగా పతనమై వుంది.



బ్యాంకుల వద్ద వేల కోట్ల నిధులు వున్నప్పటికీ ఏ బ్యాంకు మేనేజరూ స్వతంత్రించి నిర్ణయాలు తీసుకోలేక పోతున్నాడు. వారిపై తరచూ విచారణలు జరగడమే ఇందుకు కారణం. వారు పూర్తిగా భయపడి పోయివున్నారు. అందువల్ల కేంద్ర ఫైనాన్స్ మంత్రి బ్యాంకు అధికార్లకు విచారణ సంస్థల వేధింపుల నుంచి రక్షణ కల్పించి; వారు సత్వరంగా నిర్ణయాలు తీసుకొనేటట్లు ప్రోత్సహించడం అవసరం.

తొరవ 11వ పేజీలో



షిర్డి సాయిబాబా మందిరము

గాంధీనగర్ - నెల్లూరు

శ్రీ బాబా వారి జన్మదిన శ్రీరామనవమి మహోత్సవములు

ఆహ్వానము

5.4.98 ఆదివారం నుండి 7.4.98 మంగళవారము వరకు శ్రీరామనవమి మహోత్సవములు జరుగును

పైరోజులలో ప్రతి రోజూ ఉదయం 7గం.ల నుండి శ్రీ బాబావారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రనామ పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొను భక్తులు, మందిర గుమస్తా వద్ద రు.50/- చెల్లించి, పూజలలో పాల్గొని, శ్రీబాబా వారి తీర్థప్రసాదములు స్వీకరించ ప్రార్థన.

ప్రతి రోజు సాయంత్రం 7.00 గం.ల నుండి సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.

8.4.98 బుధవారం మధ్యాహ్నం 12.00 గం.లకు అన్నదానము జరుగును.

... సాయిబాబా పాలక వర్గం

రాశి సిమెంట్ ఇక ఇండియా సిమెంట్ పరమేనా?

రాశి సిమెంట్‌ను స్వాధీనం చేసుకోవడానికి ఇండియా సిమెంట్స్ ప్రయత్నించిన కేసులో - టేకోవర్‌కు లైన్ క్లియర్ చేస్తు హైకోర్టు తీర్పు వెలువడడంతో మార్కెట్‌లో రాశి షేర్‌కు మరొకసారి గిరాకీ పెరిగిపోయింది. హైదరాబాద్‌కు చెందిన బివి రాజు కలల పంట రాశి సిమెంట్ కంపెనీ. ఎంతో పటిష్టమైన పునాదులపై నిలబెట్టారాయన. అంతటి ఫ్యాక్టరీని కొత్తగా నిర్మించడం కంటే, అధిక ఈక్విటీ శాతం చేజిక్కించుకొని, దాని నిర్వహణ తమ పరం చెసుకొంటే సులువుగా దక్షిణ భారత దేశంలో తమ మార్కెట్‌ను విస్తృత పరచ కోవచ్చునని భావించారు ఇండియా సిమెంట్స్ నిర్వాహకులు. దానితో రాశి షేర్లు ఒక్కొక్కటి రు300ల వంతున కొనుగోలు చేయడానికి ఓపన్ ఆఫర్ ఇచ్చారు. ఆనాటి మార్కెట్ రేటు కంటే చాలా పెద్ద ధర ఇది. అయితే తన జీవిత కాలమంతా వెచ్చించి నిర్మించుకొన్న సుందర స్వప్నం వంటి కంపెనీ తన కళ్లముందే పరుల హస్తగతం కావడం సహించలేక డాక్టర్ బివి. రాజు కోర్టుకు వెళ్లారు. కాని తీర్పు ఆయన కనుకూలించలేదు. పైపెచ్చు ఆయన కుటుంబ సభ్యులే ఆయనకు వ్యతిరేకంగా ఇండియా సిమెంట్‌తో చేతులు కల్పారు.

ఇప్పుడు ఇద్దరి మధ్య యుద్ధం ప్రారంభమైంది. ఇండియా సిమెంట్స్‌కు పోటిగా, తానూ షేర్లు కొనడానికి కౌంటర్ ఆఫర్ ఇవ్వబోతున్నారు డాక్టర్ రాజు. ఈ పరిణామంతో 31.3.98తేది నాటికి రు138లుగా వుండిన షెర్ ధర తిరిగి పెరగనారంభించింది. 2తేది నాటికి మార్కెట్‌లో ఒక్క రాశి షేర్ సైతం అమ్మేవాళ్లు లేకుండా పోయారు.

బిజినెస్ న్యూస్

డాక్టర్ ఎం. సుర్యాప్రసాద

చిన్న ఇన్వెస్టర్లు అధిక ధరలో ఈ షేర్‌ను అమ్ముకోవడం మంచిది. స్టాక్ మార్కెట్ ద్వారా అమ్ముకోవాలన్నా త్వరలో రు.275ల వరకు ధర వస్తుంది.

పెట్రోల్ ధరల తగ్గుదల- మారుతి కార్ల పెరుగుదల

ఏ దేశంలోనైనా పారిశ్రామికాభివృద్ధికి - భారీ వాహనాల అమ్మకాలు సూచిక

తొరవ 11వ పేజీలో

ప్రజా విశ్వాసంలేని ప్రభుత్వాలు

మనిషి అన్నవాడికి మాట నిలకడ ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవులలో వున్న వారికి అది మరీ అవసరం. పాలకులు చెప్పే మాట ప్రజలు విశ్వసిస్తేనే పరిపాలన సజావుగా సాగుతుంది. పాలకుల పట్ల అపనమ్మకం ఏర్పడితే ప్రజలలో అశాంతి, అరాచకత్వం ప్రబలుతాయి. చట్టాల అమలు సంగతి దేముడెరుగు, నిత్య జన జీవితమే సంక్షుభితమౌ తుంది. చరిత్రలో పలుమార్లు రుజువైన నిజం ఇది.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నిజాన్ని విస్మరిస్తున్నాడు. తానొక బాధ్యతాయుతమైన పదవిలో వున్నానన్న వాస్తవం విస్మరించి, చవకబారు రాజకీయ ప్రయోజనాల కోసం తాపత్రయ పడుతున్నా రాయన. ఎప్పటికెయ్యా ప్రస్తుతమో, అప్పటికా మాటలాడి పబ్బం గడుపుక పోవాలని ప్రయత్నిస్తున్నాడు. అబద్ధాలు, మాయమాటలు, మోసపూరిత వాగ్ధానాలతో ప్రజలను వంచిస్తున్నారు. నిజం చెప్పడమన్నది తన జాతకంలోనే లేదన్నట్లు ప్రవర్తిస్తున్నారు.

బిజెపి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే విషయంలో చంద్రబాబు అనుసరించిన వైఖరి ఈ అవాంఛనీయ పోకడలకు పరాకాష్ఠ పంటిది. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడిన క్షణం నుంచి చంద్రబాబు ప్రవర్తన హేయంగా మారింది. చెప్పిన అబద్ధం చెప్పకుండా చెప్పి దేశ రాజకీయాలను గందరగోళ పరచారు. ఎంతో హుందాతనం, గౌరవం కల్గిన లోక్‌సభ స్పీకర్ పదవిని సైతం చవకబారు తనంతో చులకన ప్రాయం చేశాడు. వాజ్‌పేయి ప్రభుత్వంపై విశ్వాస తీర్మానాన్ని సమర్థించే విషయంలోనూ చివరి క్షణం వరకు ఆయన వైఖరి అసహ్యంగా వుండింది. లోలోపల బిజెపితో లోపాయికారీ ఒప్పందాలు చేసుకొంటూ, పైకి మాత్రం తనకు, బిజెపికి ఎటువంటి సంబంధాలూ లేవన్న భ్రమ కల్పించడానికి ప్రయత్నించాడు. బిజెపి ప్రభుత్వాన్ని సమర్థించాలని తాను ఇష్టపడి వుంటే ఆ మాట స్పష్టంగా బయటకు చెప్పి, ఓటువేసి వుండవచ్చు. అందుకు ఎవరూ అభ్యంతర పెట్టరు. కానీ బిజెపికి తాను ఎంతో దూరం అని పదేపదే ప్రకటనలు చేస్తూ - దొంగచాటుగా, రహస్యంగా, ఆఖరి నిముషంలో వారికి ఓటు వేయుపలసిన అవసరం ఏమి వుంది?

బిజెపిని సమర్థించాలన్న నిర్ణయం వెనుక తాను తప్పుచేస్తున్నా ననే గిల్టినెస్ చంద్రబాబులో పుష్కలంగా వుండింది. దాన్ని కప్పిపెట్టుకోవ డానికి అబద్ధాలు చెప్పి, అర్థం పర్థంలేని సన్నివేశాలు సృష్టించి దేశ రాజకీయాలను గందరగోళ పరిచారాయన. చవకబారు డ్రామా చేష్టలు ప్రదర్శించాడు.

మద్యపాన నిషేధం తొలగింపు వియంలోనూ చంద్రబాబు వైఖరి ఇదే తీరులో అభ్యంతరకరంగా వుంది. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో మద్యనిషేధం తొలగించే ప్రశ్నేలేదని బల్లగుద్ది వాదించాడు; ఎన్నికలు కాగానే నిషేధం సడలించాడు. మొన్నటి ఎన్నికలలో మద్యనిషేధం సడలింపు పాక్షికం మాత్రమేనని పదేపదే చెప్పాడు. పోలింగ్ ముగియగానే వీధివీధికి ఒక బ్రాండీ షాపు తెరిచేందుకు అనుమతించాడు. ప్రజలేమను కొంటారోనన్న వెరపు లేశమాత్రం లేదాయనకు.

పరిపాలనా పరంగా చాలా విషయాలలో చంద్రబాబు తీరు ఇట్నే వుంటున్నది. తెలుగు దేశం పార్టీ నేతగా ఆయన తన పార్టీ వ్యవహారాలలో అబద్ధాలు, కల్లబొల్లి కబుర్లు చెప్తే అది వేరే విషయం. కాని ప్రభుత్వాధినేతగా సైతం అసత్యాలతో, తప్పుడు తపంతో పరిపాలన చేంకుచూడడం క్షమించరాని విషయం. ఈ వైఖరి వల్ల చంద్రబాబు ఏమి చెప్పినా ప్రజలు విశ్వసించలేని పరిస్థితి పచ్చేసింది. ఎల్‌అండ్‌టి కుంభకోణం, విశాఖ రేవు భూముల గోల్‌మాల్, ఏలేరు నష్టపరిహారం స్కాం, బంజారా హిల్స్ భూ కుంభకోణం వంటి విషయాలలో దర్యాప్తుకు నిరాకరించి, ప్రభుత్వపర

జనహారతి

విపరణలతో, తాను నిజం చెప్తున్నానన్న ప్రకటనలతో ప్రజలను సమాధాన పరిచారిది వరకు. ఇప్పుడు ఆయన తత్వం అర్థమైంది కాబట్టి ఆ స్వాహా కార్యక్రమాలన్నిటిలోనూ చంద్రబాబుకు సహభాగం వుందని విశ్వసించ వలసి వస్తున్నది. ప్రభుత్వపరంగా ఆయన చేసే ఏ ప్రకటననూ విశ్వసించడం చాలా కష్టం. ప్రజలు నమ్మని వ్యక్తి ప్రభుత్వ పెత్తనం చేయడం కంటె హాస్యాస్పదమైన విషయం వేరొకటి వుండదు.

కేంద్రంలోని వాజ్‌పేయి ప్రభుత్వం పరిస్థితి సైతం అట్లే వుంది. పెద్దలరికానికి కట్టుబడి వుంటామని వాజ్‌పేయి ఎంత ఎమ్మబలికినా - మైనారిటి పర్లాలో విశ్వాసం గల్గడం లేదు. బిజెపి ప్రభుత్వానికి రహస్య అజెండా ఒకటి వుందనే వాదం రోజురోజుకీ బలపడు తున్నది. సమాజంలోని ఒక వర్గం ప్రజలు ప్రభుత్వాన్ని సమ్మలేక; అభద్రతతో, అశాంతితో కాలం గడపవలసి రావడం ఎంతటి ప్రమాదకర పరిస్థితో వర్ణించడం సాధ్యం కాదు. దాని దుష్ఫలాలు చాలా తీవ్రంగా వుంటాయి. ప్రజా జీవితాన్ని అవి సంక్షోభానికి గురిచేస్తాయి. ఇటు రాష్ట్రము, అటు కేంద్రం కూడా ప్రజా విశ్వాసం పొందలేక పోవడం దేశానికి అరిష్టం కల్గించే విషయం.

చంద్రబాబు నాయుడు ఇప్పటికైనా తన తత్వం మార్చుకుంటే మంచిది. అబద్ధాలు, మాయమాటలు తాత్కాలికంగా రాజకీయ లాభం చేకూర్చవచ్చు; కానీ దీర్ఘకాలంలో అవే రాజకీయ సమాధిని నిర్మిస్తాయి. చంద్రబాబు ఆ నిజం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

* * *

కాలనేమిక్రిపు ! బ్రిటిష్ ప్రధాని!

అమెరికాలోని 30 లక్షల శాఖాహారులు క్రిపు !ను జగద్విమోచక మహాపురుషునిగా అట్లీ తర్వాత బ్రిటిష్ ప్రధాని ఈయనే అని, ఆర్థిక క్లేశాల నుంచి బ్రిటన్ను తప్పించగల సమర్థుడని ఆశిస్తున్నారు. రష్యాను యుద్ధంలోకి, ఇండియాను విప్లవ మార్గం నుంచి దౌత్య పైత్యానికి దింపగల దిట్ట, కాలాంతకుడు క్రిపు !స్టెవిన్ క్రిపు ! లొకటయితే ప్రపంచానికి ముప్పే!

ఆంగ్లో అమెరికన్ సైనిక కేంద్రం పాకిస్తాన్. ఇటీవల భారత ప్రభుత్వం కోరికపై పోషిలిస్టు నాయకురాలు కమలాదేవి చటోపాధ్యాయ పాకిస్తాన్ అంతటా పర్యటించి వచ్చింది. ఆమె తన పర్యటన విశేషాలను వివరిస్తూ - "పాకిస్తాన్ కేవలం ఆంగ్లో అమెరికన్ సైనిక కేంద్రంగా మారి పోయిందని" తెప్పారు. ఆంగ్లో - అమెరికన్ పరిహద్దులు గ్రీసు, టర్కీల నుంచి సింధు నది దాకా పాడిగింప బడినదని, ఆర్థికంగా, రాజకీయంగా పాకిస్తాన్ను చేతిలో చిక్కించుకొని అక్కడి కీలక స్థానాల్లో సైనిక కేంద్రా లేర్పరిచి, రాబోయే మూడో ప్రపంచ మహా సంగ్రామంలో రష్యాకు వ్యతిరేకంగా ఉపయోగించుటకు సిద్ధం చేస్తున్నారని ఆమె తెలివిచ్చింది. ఇదే గనక నిజమైతే భారతదేశం కూడా తన ఐచ్ఛిక వ్యతిరేకంగా యుద్ధజ్వాలల్లో తగుల్గొన వలసి వస్తుంది. భారత ప్రభుత్వం తన తాటస్థ్యతలను సంరక్షించు కోవాలంటే తన సరిహద్దు దేశాలు కూడా తటస్థంగా ఉంచేటట్లు చూడాలి. అప్పుడే యుద్ధ ప్రమాదం మనకు దూరం కాగలదు. భారత ప్రభుత్వ విధానం ఈ తాటస్థ్య దేశాల బ్లాకు నిర్మించే యత్నంలో నిమగ్నం కావాలి - అప్పుడే భారత ప్రభుత్వం శాశ్వత శాంతికి దోహద మివ్వగలదు.

వాణిజ్య ఛేంబరుకు నెహ్రూ హితవు

ఢిల్లీలో జరిగిన వాణిజ్య ఛేంబరు సమావేశంలో నెహ్రూ కొన్ని ప్రధాన

50 పైసల క్రితం ఈ వారం

వాణిజ్య పారిశ్రామిక సమస్యలపై ప్రభుత్వ అభిప్రాయాన్ని విపులీకరించారు. పరిశ్రమలను జాతీయం చెయ్యాలన్న నినాదంపై ఆయన చేసిన వ్యాఖ్య పారిశ్రామికులను రుచించలేదు. ప్రభుత్వ పన్ను విధానాన్ని, బ్యాంకులను జాతీయం చెయ్యాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను పూర్తిగా విమర్శించారు.

ద్రావిడ దేశానికి జయప్రకాష్ రాక

దక్షిణాదిన మధురలో తమిళనాడు కాంగ్రెస్ సోషలిస్టు మహాసభ జయప్రకాష్ నారాయణ అధ్యక్షతన జరిగింది.

కొరవ 10 పేజీల్లో

రైతుల ఆత్మహత్యల సమాచారం లేదనడానికి సిగ్గేయ లేదా?

రాష్ట్రంలో 300 మంది పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకొన్న విషయాన్ని ప్రశ్నించిన విపక్షీయులను అసెంబ్లీ నుండి సస్పెండ్ చేయించిన ఘనత తెలుగు దేశం పార్టీది. పత్తి రైతుల ఆత్మహత్యలకు సంబంధించిన పూర్తి సమాచారం తన వద్ద లేదని హైటెక్ ముఖ్యమంత్రి చంద్రబాబు సభలో ప్రకటించడం విడ్డూరమని పిస్తుంది. జిల్లాలో వెంకటాచలం, రాపూరు, వెంకటగిరి మండలాల్లోని వేలాది ఎకరాల్లో వేసిన వరి పంటకు దోమకాటు సోకింది. రైతులు దిక్కుతోచక అల్లాడి పోతున్నారు. తెలంగాణాలో పరిస్థితి ఇక్కడ పునరావృతం కాకమునుపే జిల్లా యంత్రాంగం మేలుకోవాలి.

గంగవరం జి. రామకృష్ణప్రసాద

సామాన్యుల ఆరోగ్యం పట్టించుకోదా?

సామాన్య ప్రజల ఆరోగ్యం గూర్చి ప్రభుత్వాలకు పట్టడం లేదు. దీనివల్ల ఎందరో సరైన వైద్య సౌకర్యం లభించక ప్రాణాలు కోల్పోతున్నారు. పాలకులకు ఈ అభాగ్యుల గోడు వినిపించడం లేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి జిల్లా కొక సూపర్ స్పెషాలిటి వైద్యశాల, ప్రతి డివిజన్ కేంద్రంలో అన్ని సదుపాయాలున్న వైద్యశాలలు నిర్మిస్తామని ఘనంగా ప్రకటించారు. కాని ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో వీటి ఊసే లేదు. మరి ఏ విధంగా వీటిని నిర్మిస్తారో ముఖ్యమంత్రికే తెలియాలి. సామాన్యులు వైద్య సౌకర్యం పొందాలంటే వేలాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. ఈ వ్యాపార సూత్రాలు బాగా ఆకళింపు చేసుకొన్న ప్రైవేట్ వైద్యశాలలు రాష్ట్రంలో దివదిన ప్రవర్ధమాన మవుతున్నాయి. హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్యశాలలోనే సిటి స్కానర్ లేదంటే, జిల్లా కేంద్రాల్లోని వైద్యశాలలు ఏ విధంగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచ బ్యాంకు, ఏవైనా విదేశాలు జాలి తలచి సహాయం చేస్తేనేగాని రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యశాలల్లోని సౌకర్యాలు మెరుగు పడవు. 6వేల కోట్ల రూపాయల పన్ను పెంచి కూడా రాష్ట్ర కన్వీనర్‌గా పనిచేస్తూనే తెరవెనుక రాజకీయాలు నెరిపాడు. ఫ్రంట్ కోర్ కమిటీ సమావేశాలను తాను ఏర్పాటు చేయాల్సింది పోయి, తనను ఫ్రంట్ నాయకులు చిన్నచూపు చూశారని తప్పుడు ఆరోపణలు చేశాడు. తటస్థంగా వుంటానంటూనే బాలయోగిని బిజెపి సహాయంతో స్పీకర్‌ను చేసి తనవైఖరిని లోకానికి చాటాడు. బిజెపిని పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మతతత్వ పార్టీ అని ఆయనే విమర్శించారు. ఆ పార్టీ మసీదులను కూలుస్తుంటే, తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో మసీదులు నిర్మిస్తున్నదని పలు సభల్లో చెప్పారు. ఈ ప్రకటనల తర్వాత ముస్లింలు చంద్రబాబుపై నమ్మకాన్ని పెంచుకొన్నారు. కాని బిజెపి ప్రభుత్వం విశ్వాస ప్రకటన సమయంలో ఆ పార్టీకి మద్దతు ప్రకటించి తన మదిలోని వాస్తవ ఆలోచనలను బయట పడేలా చేశారు. ముస్లింలకు ద్రోహం చేసిన చంద్రబాబును ముస్లింలు క్షమించరు. తగిన గుణపాఠం చెప్పి తీరుతారు.

నెల్లూరు — వి. పుష్పలత

జనవాణి

చంద్రబాబు నమ్మకద్రోహి

చంద్రబాబు నాయుడి పట్ల అన్ని పార్టీలూ అప్రమత్తంగా వుండాలి. ఎప్పుడు ఏ పార్టీకి వెన్నుపోటు పొడుస్తాడో తెలియని పరిస్థితి. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి బడ్జెట్‌లో లోటు చూపిన ముఖ్యమంత్రికి ప్రజల బాగోగులు ఎట్లా అర్థమౌతాయి?

నెల్లూరు — వి. పుష్పలత

అన్నమయ్యకు అభినందనలు

వేల వేల సంకీర్తనలతో హరిని కీర్తించి తరించిన వాగ్గేయకారుడు 'అన్నమయ్య' జీవితంపై తీసిన చిత్రానికి

కొరవ 10 పేజీల

నెల్లూరు — షేక్ మహ్మద్

అగ్గిపెట్టెలో ఆరుగజాల చీర!



అగ్గిపెట్టెలో నూలు చీరను తయారు చేసిన పరంధాములును అభినందిస్తున్న కలెక్టర్ సాంబశివరావు, డిఆర్‌డిఎ పిడి విజయానంద్

మడతపెట్టి అగ్గిపెట్టలో పెట్ట గల్గిన రీతిలో పల్చటి, ఉల్లిపొర వంటి చీరలు నేసే నైపుణ్యం ప్రాచీన చేనేతకారులకు వుండేదని చరిత్ర పుస్తకాలలో చదివి, ఔరా అనుకొనేవారం; అది సాధ్యమా అని ఆశ్చర్య పడేవాళ్లం. కాని ఆ అబ్బురం నిజమేనని, ఈ రోజుల్లో కూడా అటువంటి అపూర్వ కళను ప్రదర్శించే వారున్నారని కరీంనగర్ జిల్లా సిరిసిల్లవాసి నల్ల పరంధామయ్య నిరూపించారు. ఈయన నేసిన ఆరుగజాల చీరను 30తేది జిల్లా కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు అగ్గిపెట్టె నుండి తీసి టౌన్‌హాల్‌లో సభికులకు చూపెట్టారు. ఇటువంటి అబ్బురాన్ని స్వయంగా చూడడం ఆశ్చర్యం కలిగిస్తుందన్నారు కలెక్టర్ గారు; నెల్లూరు చేనేత కార్మికుల్లో ఉత్సాహం వున్నవారెవరైనా ముందుకు వస్తే పరంధామయ్య వద్ద ఈ అద్భుత విద్య నేర్చుకొనేందుకు తన వంతు సహాయం అందిస్తానన్నారు. అనంతరం పరంధామయ్యను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ మండలాధ్యక్షుడు సమజాల దశరధరామయ్య ఏర్పాటు చేయించారు. కలెక్టర్ సతీమణి జ్యోతిష్మతి, డిఆర్‌డిఎ పిడి విజయానంద్, ఆయన సతీమణి కూడా వేదికపై ఆశీనులయ్యారు.

బలం గలవాడివే రోజులు

సమాజంలో ప్రజాస్వామ్య విలువలు ఇంకా మిగిలి ఉండడానికి పల్లెటూరి ప్రజలే కారణమని బిజెపి ప్రధానకార్యదర్శి పి. వేణుగోపాలరెడ్డి చెప్పారు. 29తేది వైఎస్‌ఆర్ గ్రౌండ్స్‌లో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బలం గల వాడికి అన్నీ చెల్లుతున్నాయి. డబ్బున్న వాడు ఏదైనా సాధించ గలుగుతున్నాడు. సామాజిక అభివృద్ధిని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారాయన. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు సమాజ అభివృద్ధికి పాటు పడితే తద్వారా దేశాభివృద్ధి జరుగుతుందని వేణుగోపాలరెడ్డి చెప్పారు. సదస్సులో వైసి. రంగారెడ్డి, న్యాయవాది రామదండు, బాలాజీ లాకర్స్ ఎండి. పార్థసారధి, సివి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రెండు కోట్ల రూపాయల నాబార్డు నిధులు!

నాబార్డు పథకంలో నాల్గవ విడతగా జిల్లాకు రెండు కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయని ఐదు శాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఈ నిధులతో రోడ్లు, వంతెనలు నిర్మించనున్నట్లు వివరించారు. జిల్లాలో సియోజక వర్గంలో కొత్తపాళెం వద్ద 50 లక్షలతో పైపేరుపై

ఆర్‌ఎస్‌ఎస్ నేత అభిభాషణ

వంతెనను ఈ నిధులతో నిర్మిస్తారు. 50 లక్షల వ్యయంతో గుడ్లదొన నుండి అనంతపురం వరకు; 23 లక్షలతో తుమ్మల తలుపూరు నుండి ఊటుకూరు వరకు; 25 లక్షలతో శ్రామికనగర్ నుండి పొదలకూరు వరకు; మరో 25 లక్షలతో కొత్తపాళెం నుండి ములుమూడి వరకు రోడ్లను అభివృద్ధి చేస్తారు.

నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ బొమ్మ

దేశంలో ఏ రాజకీయ నాయకుడి విగ్రహాన్ని ఇప్పటి వరకు ఆవిష్కరించని తీరులో, నెల్లూరు నర్తకి సెంటర్‌లో ఎన్టీరామారావు విగ్రహాన్ని ఆవిష్కరింప జేస్తానని ఎమ్మెల్యే టి. రమేష్‌రెడ్డి ఘనంగా ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దాసుపత్రి ఆవరణలో పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు. ఈ అపూర్వ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులంతా వస్తారు. ఈ కార్యక్రమం ఎప్పుడో జరగాల్సింది, అనుకోని అవాంతరాల వల్ల ఆగిందని వివరించారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాబోయే ముందు సలహా కోసం తనమంత్రాంగానికి ప్రత్యేకంగా పిలుపించుకొన్న విషయంతో పాటు ఆయనతో తనకున్న అనుబంధాన్ని కార్యకర్తలకు

అన్న పిల్లలందర్నీ రప్పిస్తాడట రమేష్

విన్పించా రాయన. మునిసిపల్ వైస్ ఛైర్మన్ దశరధరామయ్య, కౌన్సిలర్లు ధర్మవరపు సుబ్బారావు, కోట లక్ష్మికుమారి, నవమణి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జన్మభూమి పనుల్లో కౌన్సిలర్లకు వాటాలు

తెలుగునేతల మేలుకేనా ఈ పథకం?

"కడుపు చించుకొంటే కాళ్ల మీద పడ్డట్లయింది-" నెల్లూరు మునిసిపల్ కౌన్సిల్‌లో జన్మభూమి పనుల అవినీతిపై చర్చ జరపడం; కౌన్సిలర్లు ఒకరి అవినీతిని మరొకరు బయటపెట్టుకొని వీధిన పడ్డారు. 30తేది మునిసిపల్ సమావేశం మొదలు కాగానే, తెలుగుదేశం కౌన్సిలర్లు ధర్మవరపు సుబ్బారావు, పిచ్చిరెడ్డి లేచి నిలబడి - కౌన్సిలర్లు జన్మభూమి పనుల్లో 5 శాతం వాటా తీసుకొంటున్నట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని; దీన్ని మునిసిపల్ ఛైర్మన్‌గా మీరెందుకు ఖండించలేదని వివేకానంద రెడ్డిపై విరుచుక పడ్డారు. ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేనందువల్ల తాను పట్టించుకోలేదని వివేకానందరెడ్డి సమాధానమిచ్చారు. సిపిఎం పక్ష నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన వార్తలు ఖండించ నవసరం లేదని; నిజానికి కౌన్సిలర్లు అవినీతికి పాల్పడడం క్షమించరాని తప్పని చెప్పారు. సందానీబాషా, చాట్ల నరసింహారావు, కప్పిర శ్రీనివాసులు తమ వార్డుల్లో జరిగిన పనులపై విజిలెన్స్ దర్యాప్తు చేయించినా తమకు అభ్యంతరం లేదని ఛైర్మన్‌కు చెప్పారు. రంగనాయకులపేట ప్రాంత కౌన్సిలర్ మునాఫ్ మాట్లాడుతూ తన వార్డుల్లో ఎస్టిమేషన్‌లో మేన మొత్తంలో 55 శాతానికి పనులు పూర్తయ్యాయి. ప్రజల వద్ద నుంచి దండిన 30 శాతం నిధులను అధికారులు ఏ లెక్కల్లో చూపించారని ప్రశ్నించారు. తన వార్డులో 30 శాతం వాటా పనులు చేయలేదని తెలుగుదేశం సభ్యురాలు శ్రీమతి లక్ష్మి కుమారి వివరణ ఇవ్వబోయారు. వైస్ ఛైర్మన్ దశరధరామయ్య మాట్లాడుతూ జన్మభూమి పనుల్లో అవినీతికి ఆస్కారం లేదని గొప్పలు చెప్పారు. జన్మభూమి పనులు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకుల సంక్షేమం కోసమే చేపట్టారని స్వతంత్ర సభ్యుడు షఫీ విమర్శించారు. సభ్యులు ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు వాదించుకొంటుండడంతో ఛైర్మన్ జోక్యం చేసుకొని మాట్లాడారు. 4 నెలల సుదీర్ఘ విరామం తర్వాత మునిసిపల్ సమావేశానికి వచ్చాను. ఇటువంటి వార్తలు రావడం మనసును తొలిచేస్తుంది. సభ్యుల వాదనలు విన్నాక నెల్లూరు టౌన్‌లో జరిగిన పనులన్నింటిపైనా విజిలెన్స్ దర్యాప్తు కోరితే బాగుంటుందని పిస్తుంది. విచారణ జరపడం కోసం ఎం

మునిసిపల్ సమావేశంలో రభస, రచ్చ!

బుక్స్‌ను తక్షణం సీజ్ చేయమని మునిసిపల్ కమీషనర్‌ను కోరారాయన. జన్మభూమి రచ్చ పూర్తయ్యే సరికి గంటకుపైగా పట్టింది. కూర్చునే ఓపిక లేక అప్పటికే సగానికిపైనే కౌన్సిలర్లు తమ స్థానాల నుంచి లేచి వెళ్లిపోయారు.

సాయంత్రం 6.30 ప్రాంతంలో సమావేశపు అజెండాలోని మొదటి అంశాన్ని సభ్యులు చర్చకు చేపట్టారు. కొత్త టాప్లానింగ్ చట్టం పిరిట, ప్రభుత్వం ప్రజలపైన దిక్కుమాలిన పన్నులు వేయడాన్ని స్వతంత్ర సభ్యుడు సందానిబాషా వ్యతిరేకించారు. ఏదైనా పన్నులు వేస్తే మునిసిపాలిటియే వేయాలని సూచించారు. దీనికి సంబంధించి ఛైర్మన్ జోక్యం చేసుకొని పన్నుల పెరుగుదలను పరిశీలించేందుకు కమీషనర్ కన్వీనర్‌గా, కౌన్సిలర్లు సందానిబాషా, కప్పిర శ్రీనివాసులు, దశరధరామయ్య, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, చాట్ల నరసింహారావులతో ఒక కమిటి వేశారు. ఈ కమిటి పరిశీలించి తీసుకొనే నిర్ణయాన్ని ప్రభుత్వానికి తెలియ జేయాలని తీర్మానించారు. టౌన్‌లోని పలు ప్రాంతాల్లో ప్రజలు మంచినీటి సమస్య ఎదుర్కొంటున్నారని దీన్ని గూర్చి చెబితే స్పందించే అధికారే లేరని మహిళా కౌన్సిలర్లు రమమ్మ, అరుణకుమారి ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. వాటర్ వర్క్స్‌లో అత్యవసరంగా కావల్సిన వస్తువులన్నింటినీ వెంటనే తెప్పించమని వివేకానందరెడ్డి సంబంధిత అధికారిని ఆదేశించారు.

మునిసిపల్ సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. ప్రజా సమస్యలపై సభ్యులు చర్చించడం తగ్గిపోతుంది. ఏదో ఒక వ్యక్తిగత సమస్య మీద సమావేశం ప్రారంభం కాగానే రగడ మొదలవ్వడం, అజెండా మరుగున పడిపోవడం జరుగుతున్నది. ప్రస్తుతం టౌన్‌లోని ఏ ప్రాంతంలో చూసినా ప్రజలు తీవ్ర మంచినీటి సమస్య ఎదుర్కొంటున్నారు. కాని 30తేది జరిగిన సమావేశంలో ఈ సమస్యను ఇద్దరు కౌన్సిలర్లు మాత్రమే ప్రస్తావించారు. ప్రతి సమావేశంలో కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు పెరుగు తుండడాన్ని అధికారులు వినోదంగా చూస్తున్నారు. వారిని ఏ సమస్య మీద ప్రశ్నించే కౌన్సిలర్లు లేకపోవడంతో ఉత్సవ విగ్రహాల్లా సమావేశంలో కూర్చుని లేచి వెళ్లిపోతున్నారు.

పాలు పోసిన వారికి విజయ కానుక

బహుధాన్య ఉగాదిని పురస్కరించుకొని నెల్లూరు పాల ఉత్పత్తిదారుల సహకార సమితి రైతులకు చిన్నకానుక ప్రకటించింది. 97 సంవత్సరం ఏప్రెల్ 1 తేది నుండి 98 మార్చి31 తేది వరకు డైరీకి పాలు పోసిన రైతులకు, లీటరుకు అదనంగా 25 పైసల వ్యత్యాసపు ధర చెల్లిస్తారు. దీనివల్ల రైతులకు 50 లక్షల రూపాయల మేర అదనపు ప్రయోజనం చేకూరుతుందని జనరల్ మేనేజర్ వి. రంగారావు చెప్పారు. ఈ యేడాది ఏప్రెల్ 1తేది నుంచి పాలకొనుగోలు రేటును కేజి వెన్న ప్రాతిపదికగా 133 నుంచి 140 రూపాయలకు పెంచినట్లు వివరించారు. పాలు పోస్తున్న వారికి కానుక లిస్తున్నారు. మరి పాలు కొంటున్న వారికి ధర పెంచడమే కానుకను కోవాలా?

మంచినీటి పథకాలకు జన్మభూమికి లింకు

ఏ గ్రామంలోనైనా రక్షిత మంచినీటి పథకాలు సరిగా అమలు జరగకపోతే సంబంధిత గ్రామ సర్పంచ్‌పై చర్య తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు ప్రకటించారు. 30తేది తన ఛాంబర్‌లో మంచినీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఒఎస్‌డిలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎక్కడ బోరు పాడై పోయివున్నా వెంటనే మరమ్మత్తులు చేయించమన్నారు. నీటి పథకాలను సక్రమంగా నిర్వహించని పంచాయతీలకు జన్మభూమి పనులు మంజూరు చేయనన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరక్టర్ కె. విజయానంద్, డిఆర్వో డి. వెంకటేశ్వర్లు, నెల్లూరు, గూడురు, కావలి ఆర్డీఓలు ఆరోగ్యం, రామారావు, లక్ష్మికాంతం పాల్గొన్నారు.

జిల్లాకు మంచిపేరు తేవాలి

ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఇబ్బంది రాకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా కార్యాలయం సక్రమమైన, విశిష్టమైన సేవలందించి జిల్లాకు మంచిపేరు తీసుకరావాలని కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు

నెల్లూరుసంగతులు

కోరారు. 31తేది కలక్టరేట్ ప్రాంగణంలోని ప్రభుత్వ జీవిత బీమా కార్యాలయం నెల్లూరు జిల్లా శాఖను ప్రారంభించి మాట్లాడారు. ఇంత వరకు ప్రభుత్వ ఉద్యోగులే జీవిత బీమాను చేయించుకొనేవారని, సంస్థ ఏర్పాటు చేయడం వల్ల స్థానిక సంస్థల ఉద్యోగులు కూడా బీమా చేసుకొని పిలు దొరికిందన్నారు. జీవిత బీమా చేసిన మొత్తాన్ని ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి వినియోగిస్తుందని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానాధికారి టి.

తరువ 11వ పేజీలో

సోమశిల స్వాహాలకు కలెక్టర్ బ్రేక్ వేయలేడా?

సోమశిల ప్రాజెక్ట్‌కు సంబంధించిన కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలు తుంది. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రాజెక్ట్ అభివృద్ధికి విడుదలైన నిధులను నానా రకాలుగా భోంచేస్తున్నారు. తమ కిష్టమైన వారికి ఉద్యోగాలు ఇచ్చేస్తున్నారు. ఇక్కడి ఆలయాల్లోని పూజారులు కూడా ప్రభుత్వోద్యోగులై పోయారు. 1975 ప్రాంతంలో సోమశిల ప్రాజెక్ట్ పనులు మొదలు పెట్టినా, నేటికీ అవి పూర్తి కాలేదు. నాసిరకంగా కట్టిన వివిధ కాల్వల లైనింగ్ పనులు అధికారుల పాలిట బంగారు పిచ్చుక లయ్యాయి. వీటి మరమ్మత్తులకు పెండర్లు పిలవడం, ఇష్టమొచ్చిన వారికి ధారాధత్తం చేయడం; వారి నుంచి కమీషన్లు దండుకోవడం మామూలై పోయింది. ముంపు గ్రామాలను గుర్తించి, వారికి నష్టపరిహారం చెల్లించే బాధ్యత కూడా సోమశిలలోని ఉద్యోగులకే ప్రభుత్వం అప్పచెప్పింది. దానితో వారి చేతికి బంగారు గని దొరికినట్లయ్యింది. తమ బంధువులు, స్నేహితుల చేత అప్పటికప్పుడు ఇళ్లను నిర్మింప చేసి, వాటిని నష్టాల జాబితాలోకి ఎక్కించి వెనువెంటనే పరిహారాలు చెల్లిస్తున్నారు. లక్షల్లో దోచు కొంటున్నారు. ముంపు గ్రామస్తులనే దొంగ సర్టిఫికేట్లతో, ప్రాజెక్ట్‌లోని వివిధ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్య 30కి చేరుకొంది. ప్రాజెక్ట్ కాలనీలో రామాలయం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలను కట్టారు. ఈ ఆలయాల్లోని

జిల్లావార్తలు

పూజారులు అధికారుల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు చేస్తుండడంతో సంతోషించి, వారిని ప్రాజెక్ట్‌లో ఉద్యోగులుగా తీసుకున్నారు. ఈ వ్యవహారం మళ్లీ బయట పడకుండా ఉండేందుకు ఇటీవల వీరిని దేవాదాయ, ధర్మాదాయ శాఖలకు బదిలీ చేసినట్లు తెలిసింది. ప్రాజెక్ట్ కార్యాలయాల్లో పని చేయాల్సిన 15 మంది ఉద్యోగులు నియమ నిబంధనలకు విరుద్ధంగా అధికారుల ఇళ్లలో పని చేస్తూ కాలం వెళ్ల బుచ్చుతున్నారు. ఇక్కడ పనిచేసే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇంట్లో ఇద్దరు, డిప్యూటీ ఇంజనీర్ల ఇళ్లలో ఒక్కరేసి చొప్పున; మేనేజర్, సూపర్‌వైజర్, ఎ.ఇ ఇళ్లలో పనిచేస్తూ 1తేది మాత్రం

తొలవ 8వ పేజీలో

అనంతసాగరం అయ్యవారు సిఎం ఆర్డర్‌కూ అతీతుడా?

మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో సభ్యులందరూ ముక్త కంఠంతో ఆ వ్యక్తి, ఉపాధ్యాయ వృత్తికి పనికి రాడని తీర్మానం చేశారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి పేషీ నుండి ఈ ఉపాధ్యాయుడిపై దర్యాప్తు చేసి వివరాలు పంపమని ఉత్తర్వులొచ్చాయి. కాని ఆ ఉపాధ్యాయుడిపై చర్య తీసుకొనే ధైర్యం, ధర్మాలు అనంతసాగరం మండలంలో ఏ అధికారికీ లేవు. అనంతసాగరం మండలంలో అధికారులను ముప్ప, తిప్పలు పెడుతున్న ఈ హెడ్మాస్టర్ పేరు షేక్ ఖాదర్ మొహయుద్దీన్. పనిచేసిన ప్రతిచోటా గ్రామస్తులతో గొడవే. బోగస్ సర్టిఫికేట్లు జారీ చేయిండంల ఘనాపాటి. తన క్రింద పనిచేసే ఉపాధ్యాయులకు సకాలానికి జీతాలివ్వకుండా వారా హింస పెడతాడు. ఎదురు తిరిగిన ప్రతి ఒక్కరినీ కొట్టడం ఈ మాస్టర్ ప్రత్యేకత. మండల విద్యాధికారి సైతం ఈయన చేతుల్లో తన్నులు తిన్నాడు. లెక్క లేవన్ని ఆరోపణలు; సస్పెన్షన్లు పట్టవీ మహానుభావుడికి. ఇంత ఘన చరిత్ర వున్న ఖాదర్ మొహయుద్దీన్

ఆనం పెద్ద అండ వుంటే తప్పులన్నీ ఒప్పులే!

- మహానుభావ పంచిన వాయకుడు ఆనం సంజీవరెడ్డికి శిష్యుడట. కామారెడ్డిపాడులో ఇతనికి పోస్టింగ్ ఇవ్వమని ఆయన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిని ఆదేశించడంతో; ఈ వివాదాస్పద హెడ్మాస్టర్ రాక కోసం అక్కడి ఉపాధ్యాయులు బిక్కు బిక్కుమంటూ ఎదురు చూస్తున్నారు.

ఉచిత నేత్ర శిబిరం

నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలోని సంచార నేత్ర చికిత్సా విభాగంలోని వైద్యుల బృందం నేతృత్వంలో సోమశిల ప్రాజెక్ట్ కాలనీలో ఉచిత నేత్ర చికిత్సా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరు భక్తవత్సల నగర్‌లోని రాజ్యలక్ష్మి మహిళా మండలి సహకారంతో 5తేది మొదలయ్యే. ఈ

కావలి మార్కెట్ల కంపు భరించ లేకున్నారు!

కొందరు వ్యక్తులు సిండికేటుగా ఏర్పడి పాటలు పాడుతుండడం వల్ల కావలి - మునిసిపాలిటీ ఆదాయానికి గండి పడుతున్నది. కావలిలోని కూరగాయలు, చేపలు, మాంసం మార్కెట్లు, జంతు వధశాల, బందెల దొడ్ల నిర్వహణకు ఇటీవల వేలం పాటలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్టు 6 లక్షలకు; చేపలు, మాంసం మార్కెట్లు 90వేలకు; జంతు వధశాల 12వేలకు బందెల దొడ్డకి 3వేల రూపాయల వద్దే పాట తెగిపోయింది. గత ఏడాది కూరగాయల మార్కెట్టును 7 లక్షలా 10వేల రూపాయలకు పాడగా, చేపలు, మాంసం మార్కెట్టు 1.30 లక్షలు, జంతు వధశాలలు 20 వేలకు పాట పాడారు. ప్రతి యేడాది పాట పెరగాల్సింది పోయి తగ్గి పోతుండడం పలు ప్రశ్నలను రేకెత్తిస్తుంది. కావలి మునిసిపాలిటి ఆదాయాన్ని పొందడమే కాని మార్కెట్ల నిర్వహణ గూర్చి పట్టించు కోవడమే మానివేసింది. మెయిన్ రోడ్డులో ఉన్న చేపల, మాంసం మార్కెట్లలోనికి సామాన్యులు అడుగుపెట్ట లేరు. అక్కడి దుర్వాసన బస్సుల్లో వెళుతున్న వారికి కూడా పోక ముక్కులు పగిలిపోతాయి. ఈ మార్కెట్ మూలంగానే ఏడాది క్రితం కట్టిన టిటిడి కళ్యాణ మండపాన్ని ఏ ఒక్కరూ వినియోగించు కోవడం లేదు. కూరగాయల మార్కెట్‌లో కన్నా బయట కూరగాయలు అమ్ముకొంటున్న వారే ఎక్కువ వ్యాపారం

పుణ్యసంస్మరణ

మాన్యుడు, మరపురాని మా నేత

సోమిరెడ్డి రాజగోపాలరెడ్డిగారు

(శ్రీనివాసమహాల్ రాజయ్య)

కీర్తిశేషులై ఏప్రిల్ 6వ తేదికి పదిహేను సంవత్సరాలు నిండుతాయి. ఈ సంతాప దినం సందర్భంలో ఆ పుణ్యమూర్తిని సంస్మరిస్తూ వారి పవిత్రాత్మకు

భక్తాంజలి ఘటిస్తున్నాము



సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - సోమిరెడ్డి హర్షవర్ధనరెడ్డి

తనుకొల్లేరు :- కొల్లంరెడ్డి సంయుక్త - బీరారెడ్డి ఉష

మరియు కుటుంబ సభ్యులు

నెల్లూరు వుబ్బరిళ్ళు

విశ్లేషకుడు

పసన్నరెడ్డి పదవీ పరిత్యాగం

నెల్లూరులో మాగుంట కుటుంబీకుల వ్యాపార, రాజకీయ సామ్రాజ్యానికి మహా సచివుడిగా వుండిన పివి. ప్రసన్నరెడ్డి ఆ సంస్థల నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. మాగుంట సంస్థలతో ఆయన అనుబంధం పద్దెనిమిదేళ్ల సుదీర్ఘకాలం నడిచింది. సినిమా హాళ్ల మేనేజరుగా మాగుంట సంస్థానంలో ప్రవేశించిన ప్రసన్న అంచెలంచెలుగా ఎదుగుతూ వారి కార్పొరేట్ కంపెనీలకు మేనేజింగ్ డైరక్టరుగా ఉన్నతి పొందారు. చిన్న తరహా పరిశ్రమగా ప్రారంభమైన బాలాజీ స్టీల్స్ ఐదారు వందల కోట్ల టర్నోవర్ కల్గిన భారీ పరిశ్రమగా రూపాంతరం చెందిందంటే - అది ప్రసన్న సామర్థ్యం క్రిందే లెక్క. వెయ్యి మందికి పైగా కార్మికులున్న పరిశ్రమలలో ఏ రోజూ సమ్మెలు, గొడవలు లేకుండా నడిపించిన చతురుడు. స్వర్గీయ సుబ్బరామిరెడ్డి గారి రాజకీయ రంగ ప్రవేశం తర్వాత, మాగుంట కుటుంబానికి నెల్లూరు జిల్లాలో రాజకీయ గుర్తింపు, గౌరవం సంతరింప బడడానికి ప్రధాన భూమిక ప్రసన్న రెడ్డిదే! అది వ్యాపార వ్యవహారమైనా, రాజకీయ సమస్య అయినా, సభలు సమావేశాల నిర్వహణ అయినా ప్రసన్నకు అప్పు చెప్తే పని పూర్తయి పోయినట్లేనని భావించేవాడు సుబ్బరామిరెడ్డి. ఆ నమ్మకంతోనే ప్రసన్నకు నెల్లూరు అసెంబ్లీ సీటుతో తన అభ్యర్థిగా పోటికి నిల్పాడు. దురదృష్టవశాత్తు విజయం వరించలేదు. ప్రసన్న జీవితంలో వైఫల్యం ఏదైనా వుంది అంటే - అది ఈ ఎన్నికే! అమెరికా నుంచి అప్పుడే దిగిన బిజినెస్ మాగ్నెట్‌తోనైనా; ఉదయగిరి పల్లెల నుంచి వచ్చి బస్ ఛార్జీ అడగడం కోసం ఎదురుగా నిలబడిన సగటు గ్రామీణుడితోనైనా వారి వారి వేవ్‌లెంగ్త్‌లో మాట్లాడి, మెప్పించి, సంతోషపెట్టి, పంపగల వాక్చాతుర్యం వుంది ప్రసన్న రెడ్డిలో! రోజుకు ఇరవై గంటలు గాడిద చాకిరీ చేసే ఓపిక వుంది!

ఎంత పెద్ద వ్యాపార సంస్థలో ఎంత పెద్ద పొజిషన్‌లో వుండినా - పరుల సేవకు విలువ తక్కువే! చిన్నదైనా స్వంత జీవితంతో సమానం కాదు. ఇన్నాళ్ల వ్యాపారానుభవంతో స్వంతంగా పరిశ్రమలు స్థాపించుకొని, నిర్వహించుకోవాలనే సంకల్పంతో మాగుంట సంస్థలు వీడారు. ఆయనకు ఉజ్వల భవిష్యత్ కలగాలని ఆకాంక్షిస్తున్నాము.

హోం మంత్రి

రాష్ట్ర హోం మంత్రి శ్రీ మాధవరెడ్డి 11తేది నెల్లూరు వస్తున్నారు. సూళ్లూరు పేటలో కొత్త పోలీస్ స్టేషన్ భవనం; గూడూరులో డిఎస్పి ఆఫీసు, ముత్తుకూరు పోలీస్ స్టేషన్ భవనాలకు రిబ్బను కత్తిరిస్తారు; నెల్లూరు టౌన్‌లో కొన్ని కార్యక్రమాలలో పాల్గొని రాత్రికే తిరిగి రైలెక్కుతారు.

చంద్రమోహనరెడ్డి

ఐదు శాఖల మంత్రి శ్రీ సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి 5తేది ఉదయం నెల్లూరు వచ్చి, రాత్రికే తిరిగి వెళ్తారు.

జిలాలో వీధి వీధినా సొరాయి అంగళ్లు

కొత్త ఎక్సైజ్ విధానం క్రింద నెల్లూరు జిల్లాలో దాదాపు 425 బ్రాందీ అంగళ్లకు లైసెన్స్‌లు మంజూరు చేశారు. గతంలో వున్న వాటి కంటే మూడింతలు అధికంగా షాపులు మంజూరైనాయి. అడిగేవారి సంఖ్య ఇక్కడితో ఆగింది కాబట్టి కాని లేకుంటే వెయ్యి షాపులు ఇవ్వడానికైనా ఎక్సైజ్ అధికారులు రెడీగా వుండినారు. చాలా మంది షాపుల కోసం దరఖాస్తు చేసి, అవసరమైన మొత్తానికి బ్యాంకు గ్యారంటీ ఇవ్వలేక పోవడంత వెనుదిరిగి వచ్చేశారు.

వీలైనన్ని ఎక్కువ షాపులు పెట్టి, వీలైనంత ఎక్కువ బ్రాందీ అమ్మించమని చంద్రబాబు ఎక్సైజ్ అధికార్లను అదేశించడంతో వారు పాపం నానా తంటాలు పడ్తున్నారు. గత ఏడాది కంటే కనీసం రెట్టింపు బ్రాందీ సీసాలు అమ్మించే బాధ్యత వీరిపై పడిందట. దానితో ప్రతి అధికారికీ కోటాలు నిర్ణయించి, అంగళ్లవారిపై వత్తిడి తెచ్చి బ్రాందీ అమ్మకాలు పెంచడానికి ప్రయత్నిస్తున్నారు.

అయితే దాన్లో, పల్లెల్లో కొత్త బ్రాందీ అంగళ్లు పస్తున్న తీరు చూస్తుంటే కడుపు రగులుకపోతూంది. ఇళ్ల మధ్యలో, స్కూళ్లకు దగ్గరలో, గుడులు, మసీదులు ప్రక్కన బ్రాందీ షాపులు వెలిశాయి. రోడ్డు మార్జిన్‌లో స్థలం ఆక్రమించి, రాత్రికి రాత్రి గదులు కట్టిపారేస్తున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు, మునిసిపల్ ఛైర్మనాదులు కళ్లుమూసుకొని వారి ఇష్టా రాజ్యానికి వదిలేస్తున్నారు. విద్యుత్ బోర్డు సిబ్బంది అహు మేహుల మీద వారికి కరెంటు సదుపాయం కల్పిస్తూంది.

ఇంకొక ప్రక్క, తెలుగుదేశం నేతలు అంగళ్ల నుంచి రౌడీ మామూళ్లు దండుకోవడంలో బిజీ అయిపోయారు. ఒక్కొక్క అంగడికి లక్ష లెక్కన తమకు చందా చెల్లిస్తేనే లైసెన్స్ వచ్చేట్లు చూస్తామని; లేదంటే రోడ్డు ప్రక్కనున్నాదనీ, బడికి దగ్గరనీ సాకు చూపించి లైసెన్స్ రద్దు చేయించేస్తామని తెలుగు నేతలు బెదరించారట. దానితో అంగళ్ల వారందరూ ఒక సంఘంగా ఏర్పడి, వారితో చర్చలు జరిపి, అంగడికి యాభైవేల లెక్కన రేటు కుదుర్చు కున్నారట. ఆ సొమ్ము తమకు ముట్టిన తర్వాత, తెలుగునేతలిచ్చే చీటి చూపిస్తే తప్ప ఎక్సైజ్ అధికారులు లైసెన్స్ లివ్వడం లేదు. ఈ నాలుగైదు రోజుల్లోనే తెలుగునేతలకు అరకోటి లంచం దండకమైంది. పల్లెల్లో తెలుగు ఎమ్మెల్యేలు తమ అనుచరుల చేత షాపులు పెట్టించి, భాగాలు కుదుర్చు కొంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలంటూ వస్తే తెలుగుదేశం ఎమ్మెల్యే లెవరికీ డబ్బుకు వెతుక్కోవలసిన అవసరం లేనంత మొత్తాలు ఇప్పుడు వారి జేబులో పడిపోతున్నాయి. మరీ ఇంత నీచంగా డబ్బు దండుతున్నారేమిటని ఒక నెల్లూరు నాయకుడ్ని అడిగితే - "పబ్లిక్‌కు సంబంధం లేని కరప్షన్ కదా - ఆ మాత్రం రాబడి లేకుంటే రాజకీయం చేసేదెట్లా" అని ఎదురు ప్రశ్నించాడట - సిగ్గు లేకుండా!

అంగడి వచ్చిన ప్రక్క క్షణం నుంచే చీప్ లిక్కర్ అమ్మకాలు ఉధృతంగా ప్రారంభమై పోయాయి. సాయంత్రమైతే వీధుల్లో తిరగలేని పరిస్థితి. ఇళ్ల మధ్యలో అంగళ్లు, రోడ్లోనే త్రాగించడంతో గలీజుగా వుంది వాతావరణం. ఆ దృశ్యాలు చూస్తుంటే అడవారిలో కడుపు రగులుకపోతూంది. కానీ ఏమి చేయలేని నిస్సహాయత. తెలుగుదేశం, కాంగ్రెస్, సిపిఎం, బిజెపి వంటి పార్టీలన్నీ సారా వ్యాపారులకు అమ్ముడు పోయాయి. ప్రతి నేతకూ ఈ వ్యాపారంతో ఏదో రూపంలో లింకు వుంది; మొగమాటం వుంది. అందువల్ల రోడ్డు మార్జిన్లలో కట్టే అంగళ్లను, ఇళ్ల మధ్య అంగళ్లను సైతం అభ్యంతరం పెట్టలేక పోతున్నారు. ఎవరైనా పూనుకొని మహిళలను ప్రోత్సహించ గల్గితే మాత్రం గతంలో కంటే ఉధృతమైన పోరా వ్యతిరేక ఉద్యమం వచ్చును. కానీ ఇప్పట్లో ఆ అవకాశం లేదు. అరవాళ్లు తమలో తాము కుమిలి పోవలసిందే!

వెంకటగిరి ఉన్మాది వదంతుల భయం

వెంకటగిరి శివార్లలో గత నెల 24తేది జరిగిన హత్యలకు సంబంధించి పోలీసు ఎంత ప్రయత్నించినా చిన్నపాటి ఆధారం సైతం సంపాదించ లేకపోతూంది. హైదరాబాదు నుంచి ఐజి స్థాయి అధికారులు, సిబిసిఐడి నిపుణులు, వందలాది మంది పోలీసు సిబ్బంది జిల్లాకు వచ్చారు. పత్రికలలో రోజుకొక ప్రకటన చేస్తున్నారు. చిత్తూరు, నెల్లూరులకు కలిపి సమాహాలు పెడుతున్నారు. కానీ ఫలితం సున్నా.

చిత్తూరు, కడప, వెంకటగిరిలలో కలిపి గత ఏడాది కాలంలో 14 సంఘటనల్లో 34 మంది హత్య గావింపబడ్డారు. అన్ని హత్యలూ ఒకే రీతిలో జరిగాయి. కాని హంతకులు ఒకరా, ఇద్దరా, నలుగురా; హత్యలు ఎందుకు చేస్తున్నారు; ఎట్లా చేస్తున్నారు అన్న అంచనాయే వీలు కావడం లేదు. ఎవరో స్త్రీ ద్వేషి అయిన ఉన్మాది ఈ దురాగతానికి పాల్పడు తున్నాడని పోలీసుల అనుమానం. చంప బోయేముందు, నిద్ర పోతుండే వారిపై ఏదో మత్తు మందు చల్లి నింపాదిగా తన శాడిజం తీర్చుకొంటున్నా డనేది ఇంకొక సందేహం. ఇన్ని దగ్గర ఇన్ని హత్యలు చేస్తూ కూడా చిన్నపాటి క్లూ సైతం వదలకుండా పోలీసును ఏడ్పిస్తున్నా ఆ హంతకుడెవరో కాని అసాధ్యుడే.

ఇదిట్లా వుంటే ఈ హత్యల భయం జిల్లా అంతా వ్యాపించి పోయివుంది. చీకటి పడితే గ్రామాలలో తిరగడానికే జనం వడలి పోతున్నారు. శివార్లలో, పొలాల మధ్య కాపురాలు వుండేవారు నిద్ర అన్న మాట మర్చిపోయారు. ఇదిగో పులి అంటే, అదిగో తోక అన్న తీరులో ప్రచారమౌతున్న వదంతులకు ప్రజలు మరీ వణికి పోతున్నారు. ప్రతి గ్రామంలో యువకులు బృందాలుగా ఏర్పడి రాత్రంతా జాగారం చేస్తూ తిరుగుతున్నారు. దారిలో ఎవరు కొత్తవాళ్లు కన్పడినా ముందు, వెనుక చూడకుండా ఉతికి పారేస్తున్నారు. పట్టపగలు కూడా బిచ్చగాళ్లు, సాధువులు గ్రామాలలో తిరగలేక పోతున్నారు. కొత్తవాడు ఎవడు కన్పడినా అనుమానంగా చూస్తున్నారు. జనానికి ధైర్యం కల్పించడంలో పోలీసు దారుణంగా విఫలమౌతూంది. వారి పహారా ప్రజలలో విశ్వాసం కల్పించడం లేదు. ఈ సమస్యకు ఒకటే మార్గం - ఆ ఉన్మాద హంతకుడ్ని పట్టుకోవడం. అదెంత త్వరగా జరిగితే అంత మేలు.

టీచర్ పోస్టులకు కుప్పలుగా దరఖాస్తులు

జిల్లా పరిషత్‌లో ఖాళీగా వున్న సెకండరీగ్రేడ్, బిఇడి టీచర్ పోస్టులకు 7వేల 120 దరఖాస్తులు ఉన్నాయి. 19తేది నుంచి జరపబోయే వ్రాత పరీక్షలో వీరిని వడబోస్తారు. పరీక్షలకు శిక్షణ ఇస్తామంటూ నెల్లూరు టౌన్‌లో కుక్క గొడుగుల వలె కోచింగ్ సెంటర్‌లు పుట్టుకొచ్చేశాయి. నిరుద్యోగులు చాలా అతృతగా వున్నారు పాపం; కలెక్టర్ గారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వ్రాత పరీక్షల్లో, ఇంటర్వ్యూలలో అక్రమాలు జరగకుండా, నిరుద్యోగులకు అన్యాయం జరగకుండా కాపాడడం అవసరం.

వేనాటిపై ప్రసన్న ధ్వజం

జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేనాటి మునిరెడ్డిని తక్షణం ఆ పదవి నుంచి తప్పుండాలని కోవూరు ఎమ్మెల్యే కే పల్లంరెడ్డి ప్రసన్నకుమారరెడ్డి పట్టు పడ్తున్నారు; పత్రికలలో విమర్శలు కుప్పస్తున్నారు. కోవూరులో తనకు వ్యతిరేకులపై కొందరు తెలుగు యువకులను మునిరెడ్డి వేరుపస్తున్నాడన్నది ప్రసన్న ఆగ్రహం. ఇద్దరూ ఒకర్నొకరు, తిట్టుకొంటూ పత్రికలు చదివే వారికి మంచి కాలక్షేపం కల్గిస్తున్నారు.

అయితే ప్రసన్న ఒక్కడు అలిగితే చంద్రబాబు కదులుతాడా?

రెడ్‌క్రాస్‌కు గోల్డ్ మెడల్

గత సంవత్సరంలో విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గుర్తింపుగా నెల్లూరు రెడ్‌క్రాస్ శాఖకు బంగారు పతకం బహూకరించారు గవర్నర్ డాక్టర్ రంగరాజన్. 27తేది రాజ్‌భవన్‌లో జరిగిన ఒక సమావేశంలో నెల్లూరు రెడ్‌క్రాస్ కార్యదర్శి డాక్టర్ ఎవి. సుబ్రహ్మణ్యం ఈ గోల్డ్ మెడల్ స్వీకరించారు. కంగ్రాచ్యులేషన్స్.

నెల్లూరు ఏడవ ఎమ్పీ పి. ప్రభాకరరెడ్డి

హైదరాబాదు వైస్రాయ్ హోటల్ అధినేత శ్రీ పర్వతరెడ్డి ప్రభాకరరెడ్డి రాజ్యసభ సభ్యుడైనారు. తెలుగుదేశం అభ్యర్థిగా, సునాయసంగా గెలుపొందారాయన. ఎస్టీఆర్ నుంచి అధికారం పెరుక్కోవడానికి తాను నడిపిన కుట్ర సమయంలో తనకు, తన ఎమ్మెల్యేలకు వైస్రాయ్ హోటల్‌లో ఆశ్రయం కల్పించి నందుకు కృతజ్ఞతగా ప్రభాకరరెడ్డికి ఈ పదవి బహూకరించాడు చంద్రబాబు.

ప్రభాకరరెడ్డి అల్లూరు వాసి; హైదరాబాద్‌లో ప్రసిద్ధ న్యాయవాదిగా, ఆ తర్వాత జనతాదళ్, బిజెపి పార్టీలలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్పీ శ్రీ పర్వతరెడ్డి బాబులురెడ్డి కుమారుడాయన. మంచి వ్యాపార దక్షత కల్గిన యువకుడు. రాజకీయాలతో ఏమాత్రం సంబంధం లేదు. చంద్రబాబుతో స్నేహం వల్లనే ఆ పిచ్చి పట్టుకున్నట్లుంది. పిన్న వయస్సులోనే రాజ్యసభ సభ్యత్వం పొందిన ప్రభాకరరెడ్డికి మా అభినందనలు. ఆయన ఎన్నికతో నెల్లూరు నుంచి ఎమ్పీలైన వారి సంఖ్య ఏడుకు పెరిగింది.

* * *

ఇల్లు అమ్మబడును

ట్రంకురోడ్డులోని బిఆర్‌సి సెంటర్ డౌని చర్చి ఎదురుగా 14/472 డోర్ నంబరు గల సుమారు 15 అం. స్థలంలో కట్టబడిన పెంకుటిల్లు వున్నది. వున్నట్లు గానే అమ్మబడును. వివరాలకు నేరుగా అదే అడ్రసులో సంప్రదించ గలరు.

...జయకుమార్

నెల్లూరు బజారు

మొలగొలుకులు		
9672	పాతవి	4,700/-
	క్రొత్తవి	4,200/-
9674	పాతవి	5,500/-
	క్రొత్తవి	4,200/-
జిలకర్ర మహారి	పాతవి	6,000/-
	క్రొత్తవి	4,200/-
1001		3,600/-
మొలగొలుకుల బియ్యం		
	బస్తా 70 కిలోలు	800/-
బంగారు సవర (8 గ్రా.)		3,200/-
వెండి	(10గ్రా)	90/-

జమీన్‌రైతు చందా

సంవత్సరచందా	రూ.100లు
ఆరు నెలలకు	రూ.50లు
ప్రతిప్రతి	రూ.2-

VIMAL వసంతోత్సవ్ - 98, వేడుకల్లో పాల్గొనండి
కేవలం రూ. 250/- ల విలువగల విమల్ వస్త్రాలు కొనుగోలు చేయండి!
రూ. 60 లక్షల విలువగల 5500 అద్భుతమైన బహుమతులు గెలుపొందండి
ఈ అవకాశం 30.4.98 వరకు మాత్రమే!!
విమల బిల్లువారి వస్త్రాలు అందరికీ అందుబాటు ధరలతో
సూటింగ్ మీటరు రూ. 140/- ల నుండి
షర్టింగ్ మీటరు రూ. 65/- ల నుండి
శారీస్ రూ. 250/- ల నుండి లభించును
VIMAL ఓన్లీ విమల్
మిల్స్ షోరూం
ఉదయాంజలి
గాంధీబొమ్మ సెంటర్, ట్రంకురోడ్డు, నెల్లూరు. ఫోన్: 320257
బంధువులందరికీ : షర్ట్స్, ట్రౌజర్స్, ప్యాంట్స్, సూటింగ్స్, సారీస్

జనార్దనరెడ్డి

2వ పేజీ తరువ

అటువంటి మార్గం అన్వేషించాలి.

ఆంధ్రప్రదేశ్‌లో 300 మంది పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ మనో వ్యాకులత ఒక అంటు వ్యాధి వలె ఇతర రాష్ట్రాలకు ప్రాకుతున్నది. అయితే చనిపోయిన వారికి లక్ష రూపాయల లెక్కన చెల్లించి చేతులు దులుపుకుంటున్నది రాష్ట్ర ప్రభుత్వం. అది రైతులకు ఏ విధంగానూ వుపయోగ పడదు. పంట భీమా పథకం వుండి వుంటే రైతులకీ గతి పట్టి వుండదు. ఇప్పుడుండే భీమా పథకం కేవలం బ్యాంకు అప్పుల వరకే పరిమితం. తన స్వంత పెట్టుబడితో వ్యవసాయం చేసుకొనే రైతుకు అది వర్తించదు. అందువల్ల ప్రధాని వాజ్‌పేయి రైతులకు ఉపయోగపడే భీమా పథకం గురించి ఆలోచించాలి.

నైతిక ప్రమాణాల గురించి పెద్ద పెద్ద మాటలు వాడుతున్నారు. అయితే ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వంలో హత్యలు చేసిన వారు, దొంగ సారా కాచే వారు మంత్రులైనారు. బిజెపి దృష్టిలో నైతిక ప్రమాణాలంటే అవేనా? వాటిని కేంద్రంలోనూ అమలు చేయబోతన్నారా? అదే జరిగితే మీ ప్రభుత్వాన్ని ఆ భగవంతుడే కాపాడ వలసి వుంటుంది. ఏకాభిప్రాయ సాధన, సహకార భావంతో ప్రభుత్వం నడుపుతామని వాజ్‌పేయి ఒక వంక చెప్తున్నారు; ఇంకొక ప్రక్క ద్వంద్వ ప్రమాణాలు, రెండర్థాల మాటలు, రెండు ప్రక్కల మోసం చేస్తున్నారు. స్పీకర్ ఎన్నికలోనే అది అర్థమైంది. జయలలిత, మమతా బెనర్జీ, సుఖ్‌రాంలతోనూ అటువంటి తప్పుడు ఒప్పందాలు చేసుకుంటున్నారు. పార్లమెంట్‌లో విశ్వాస తీర్మానం గెలవడం ఒక్కటే సుస్థిరత కాదు. తెలుగుదేశం పార్టీ మీకు ఓటు చేసింది; కానీ ఆ వెంటనే రాష్ట్ర మంత్రి బాబూఖాన్ రాజీనామా చేశారు. దానర్థం - దేశ ప్రజలలో మీ పట్ల విశ్వాసం లేదని! ప్రజా విశ్వాసం లేకుండా ప్రభుత్వ సుస్థిరతను ఎట్లా అందివ్వగలరు మీరు?

మహాత్మాగాంధీ 50వ వర్ధంతిని అమరత్వం సాధించిన సందర్భంగా పరిగణించ బోతున్నామని చెప్పారు. ఆ అర్హత మీకు వుందా? ఆర్‌ఎస్‌ఎస్ అధినేత ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ - గాంధీని చంపిన గాడ్సేను ఇప్పుడూ ప్రశంసిస్తున్నారు. ఆ వారసత్వంలో నుంచి వచ్చిన బిజెపి వారికి మహాత్మాగాంధీ అమరత్వాన్ని ప్రస్తావించే అర్హత ఎక్కడుంది? ఆర్‌ఎస్‌ఎస్ 1925లో స్థాపించ బడింది. కాని ఆ తర్వాత జరిగిన సైమన్ కమిషన్, సత్యాగ్రహం, వ్యక్తి సత్యాగ్రహం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా వంటి ఉద్యమాలు వేటిలోనూ పాల్గొనలేదు. అటువంటప్పుడు బిజెపి స్వాతంత్ర్య సమర ఉద్యమానికి తమను తాము వారసులుగా ఎట్లా వర్ణించుకోగల్గుతుంది?

బిజెపి ప్రభుత్వాన్ని సమర్థించడానికి జయలలిత కొన్ని షరతులు విధించిందని చెప్పవ్వారు. చంద్రబాబు నాయుడు సైతం అటువంటి షరతులేమైనా విధించాడో లేదో నాకు తెలియదు. అయితే అల్‌మట్టి డ్యాం నిర్మాణం ఆంధ్ర రైతుల ప్రయోజనాలను తీవ్రంగా నష్టపరుస్తున్నది. ఆ నిర్మాణం అన్యాయమైనది. అప్పర్ తుంగభద్ర పథకం సైతం రాయలసీమను నష్ట పరుస్తుంది. ఇవి రెండూ బచావత్ అవార్డుకు వ్యతిరేకమైనవి. కేంద్ర ప్రభుత్వం వీటి రెండింటినీ తక్షణం నిలుపుదలచాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఉగాది కానుక

1వ పేజీ తరువ

ప్రశ్నించరాదని హుకుం జారీ చేశారు. తాటి చెట్ల క్రింద కల్లు పోసినట్లు అంగడి ముందే బెంచీలు వేసి బ్రాందీ, విస్కీలు సరఫరా చేసినా ఎక్సైజ్ అధికారులు అభ్యంతర పెట్టరని హామీ ఇచ్చాడు. ఎవరు ఎంత ఎక్కువగా బ్రాందీ అమ్మితే వారికి అంత గుర్తింపు వుంటుందని, వారికి డిస్కౌంట్లు, ఇన్సెంటివ్‌లు వుంటాయని ప్రకటించాడు.

దీనితో బ్రాందీ వరదకు షట్టర్లు వూడి పడ్డాయి. ప్రతి గ్రామంలో ప్రతి వీధిలో బ్రాందీషాపులు ఏర్పడ్డాయి. ఇంటింటికి సారాయి సీసా అనే పథకం ఒకటి ప్రభుత్వం అమలు చేస్తున్నదా అని సందేహించ వలసిన తీరులో వుంది వాతావరణం. ఇళ్ల మధ్య, దేవాలయాల ఎదుట, స్కూళ్ల ప్రక్కన, కాలేజీ ప్రహరీల కానుకొని కూడా బ్రాందీ అంగళ్లు వెలిశాయి. చీప్ లిక్కర్ అపబడే రంగు నీళ్లు కలిపిన సారా విచ్చల విడిగా అమ్ముడౌతున్నది. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఆళ్లగడ్డ వంటి ప్రాంతాలలో తెలుగుదేశం నేతలు నెలకొల్పివున్న కల్తీ బ్రాందీ ఫ్యాక్టరీలు మూడు షిఫ్టులు పనిచేయవలసి వస్తున్నది. కాపుడు సారాకు రంగు కలిపి, సీసాల్లో పోసి రాష్ట్రంలోని ప్రతి బ్రాందీ షాపుకూ సరఫరా చేస్తున్నారు వీరు. ప్రభుత్వం సరఫరా చేసే సాధారణ మద్యం ఖరీదు ఒక సీసా యాభై రూపాయలైతే, ఈ తెలుగుదేశం నేతలు తయారు చేసే చీప్ లిక్కరు ఖరీదు కేవలం ఇరవై రూపాయలే. అది దొంగసారా కావడంతో ఎక్సైజ్, సేల్స్ ట్యాక్స్ వంటివేవీ వుండవు. అంగళ్ల వారికి నూటికి నూరు శాతం లాభం. అయితే ఇది విషంతో సమానమైన మద్యం. వరుసగా నెలరోజులు ఈ సీసాల్లోని మద్యం సేవిస్తే శరీరంలోని అవయవాలన్నీ చచ్చు బడిపోతాయి. కంటి చూపు మందగిస్తుంది. మెదడు మొద్దుబారి పోతుంది. స్లో పాయిజన్ వలె పనిచేసి కొంత కాలానికి ప్రాణం తీస్తుంది.

కొత్త ఎక్సైజ్ విధానం అమలు చేసి తొలిరోజే ఈ చీప్ లిక్కర్ అధికంగా సేవించడం వల్ల చిత్తూరు జిల్లాలో ఒక రిక్షా కార్మికుడు బ్రాందీ షాపు ముందే నురగలు కక్కుకొని చనిపోయాడు. ఇటువంటి చావులు ప్రతి పల్లెల్లో, పట్టణంలో చాలా సాధారణం కాబోతాయి ఇక నుంచి!

జనం త్రాగివచ్చినా ఫర్వాలేదు - బ్రాందీ అమ్మకాలు జోరుగా జరిగి, ఖజానా నిండితే చాలునన్న ధోరణిలో వ్యవహరిస్తున్నాడు చంద్రబాబు. బహుధాన్య సంవత్సర ఉగాదికి తెలుగు ఆడపడుచులకు ఆయన ఇచ్చిన కానుక ఇదీ!

* * *

పడుగుపాడు గ్రామ పంచాయతి, నెల్లూరు జిల్లా

టెండరు ప్రకటన

ROC No:15/98

Dt:1.4.98

నెల్లూరు జిల్లా, కోవూరు మండలం, పడుగుపాడు గ్రామ పంచాయతీకి 1998-99 సంవత్సరానికి గాను ఈ దిగువ తెల్పిన వస్తువులు సరఫరా చేయుటకు సీల్డు టెండర్లు కోరబడు చున్నవి. సదరు టెండర్లు ఈ గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారిచే గాని లేదా వారి అనుమతి పొందిన వారిచేగాని 15.4.98తేది బుధవారం సాయంత్రం 3గం.ల (మూడు గంటల) వరకు స్వీకరించబడి ఆదే రోజు సాయంత్రం 4 గం.లకు(నాలుగు గంటలకు) హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరువబడును. టెండర్లలో పాల్గొను వారు ఈ క్రింద తెల్పిన ఆయా ఐటములకు ఎదురుగా నిర్ణయింపబడిన ధరావత్తు మొత్తం చెల్లించి రశీదును టెండర్లకు జతపరచి దాఖలు చేయవలెను. మరియు అదే రోజు ఉదయం 11 గం.లకు పంచాయతీ కార్యాలయం నందు ఈ దిగువ చూపబడిన ఐటములు బహిరంగ వేలములు జరుపబడును. మిగతా వివరములు నిబంధనలు ఆఫీసు పని చేయు వేళలో వచ్చి తెలుసుకొన వచ్చును.

ప.నెం.	వివరములు	ధరావత్తు మొత్తము
1.	1998-99వ సం.నకు స్టేషనరీ సామాన్లు సరఫరా	50-00
2.	1998-99వ సం.నకు పుస్తకములు మరియు ఫారములు సరఫరా	50-00
3.	1998-99వ సం.నకు చేతి పంపుల విడిభాగములు సరఫరా	100-00
4.	1998-99వ సం.నకు డీప్‌బోర్‌వెల్స్ విడిభాగములు సరఫరా (ఇండియన్ మార్కు-IIకు సంబంధించిన విడి భాగములు	100-00
5.	1998-99వ సం.నకు P.W.S స్కీముకు పైపులు వగైరా విడిభాగములు సరఫరా	100-00
6.	1998-99వ సం.నకు P.W.S స్కీము కరెంటు మోటార్లు రీవైండింగ్ చేయుట మరియు వాటి విడిభాగములు వేసి రిపేర్లు చేయుట అవసరమైన విడి భాగములు రేట్లు విడివిడిగా హార్స్‌పవర్ వారిగా చూపవలెను	50-00
7.	1998-99వ సం.నకు పబ్లిక్ హెల్తు సిబ్బందికి కొబ్బరినూనె, మరియు సబ్బులు సరఫరా	25-00
8.	1998-99వ సం.నకు పబ్లిక్ హెల్తు సామానులు సరఫరా	50-00
9.	1998-99వ సం.నకు పబ్లిక్ హెల్త్ ఎద్దుకు తవుడు, పులవలు సరఫరా	25-00
10.	1998-99వ సం.నకు పబ్లిక్ హెల్తు ఎద్దుకు ఎండు గడ్డి సరఫరా	25-00
11.	1998-99వ సం.నకు పబ్లిక్ హెల్తు టైరు బండికి 500-19టైర్లు, ట్యూబులు, రిమ్ములు, విడి భాగముల సరఫరా	25-00
12.	1998-99వ సం.నకు పబ్లిక్‌హెల్తు చెత్త బండి రిపేరు	25-00
13.	1998-99వ సం.నకు పబ్లిక్‌హెల్తు సిబ్బందికి యూనిఫారం సరఫరా (బిన్ని కంపెని వారి ఆథరైజ్‌డ్ డీలర్లు మాత్రమే పాల్గొనవలెను) మరియు పాదరక్షలు సరఫరా	100-00
14.	1998-99వ సం.నకు చెడిపొయిన చెతిపంపులు పరిక మరలాతీసి బాగుచేయుట కూలీలతో సహా రేటు కాంట్రాక్టు పద్ధతిన చేయుట	25-00
15.	1998-99వ సం.నకు గ్రామ పంచాయతీ వీధులలో చిమ్మిన చెత్తను కంపోస్టు యార్డుకు తోలుటకు డ్రైవరు, కూలి, ఆయిలు ఖర్చుతో కలిపి ఒకరోజుకు రేటుపై నెలలో నాలుగు రోజులు మాత్రము బాడుగ ట్రాక్టరు సరఫరాకు టెండరు నెల్లూరు జిల్లా కలెక్టర్ (పం.వి) వారి ఉత్తర్వులు పొందిన తరువాతనే బిల్లు మొత్తం చెల్లించబడును	100-00
16.	1998-99వ సం.నకు పంచాయతీకి ఇద్దరు కాంట్రాక్టు బేసిస్ పబ్లిక్ హెల్తు సిబ్బందిని నెల1టికి స్థిరజీతంపై నెల్లూరు జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వులు పొందిన తరువాతనే నియమించుటకు టెండర్లు	25-00
17.	1998-99వ సం.నకు ఇనమడుగు సెంటరు వద్ద P.W.S స్కీముకు ఒక పంపు ఆపరేటరు నెల1టికి స్థిరజీతంపై నెల్లూరు జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వులో పొందిన తరువాతనే నియమించుటకు టెండర్లు	25-00
18.	1998-99వ సం.నకు వీధి దీపములు రిపేరు చేయుట (ట్యూబులైట్లు, చోకులు, M.V.ల్యాంపులు వగైరా విడిభాగములు వేయుట)కు ఒక ఎలక్ట్రీషియన్‌ను నెల1టికి స్థిర జీతంపై నెల్లూరు జిల్లా కలెక్టరు (పం.వి) వారి ఉత్తర్వు పొందిన తరువాతనే నియమించుటకు టెండరు	25-00
19.	పంచాయతీకి రెండు E.C కలర్ TVలు సప్లయి చేయుట సైజుల వారీగా	25-00
20.	పంచాయతీ కార్యాలయము నందు 1 HP జెట్ మోటారు, మరియు పైపులు సప్లయి చేయుట	25-00

ప.నెం.	వేలం వివరములు	ధరావత్తు మొత్తము
1.	1997-98వ సం.నకు సంబంధించిన పాత దినపత్రికలు	25-00
2.	1997-98వ సం.నకు సంబంధించిన పాత కాలిపోయిన చేకులు	25-00

షేక్ అహమ్మద్ బాషా, కార్యనిర్వహణాధికారి

పడుగుపాడు గ్రామపంచాయతీ, కోవూరు మండలం, నెల్లూరు జిల్లా

రాయి-తేరాయి

* గబుదొంగ కావలసినవాడు - కలిగబం అయ్యాడు ఆత్రేయ

ఎట్టకేలకు ఆత్రేయ "పుట్టినరోజు" పద్యాలు దొరికాయి; నేను `జ్యోతి' మాస పత్రికలో కొన్నేళ్ల క్రిందట చదివింది ఈ పద్యాలనే; సంపాదకుడు ఇచ్చిన `ఫుట్ నోట్'లో "ఆత్రేయ అసంపూర్ణ ఆత్మకథ నుండి గ్రహించబడినవి" అని రాశారు. దీనివల్లే ఆత్రేయ `ఆత్మకథ'ను రాస్తున్నట్లు తెలుసుకొన్నాను. ఆత్రేయ 1947లో స్వాతంత్ర్యం వచ్చిన సందర్భాన జమీన్‌రైతులో రాసిన (అప్పుడాయన జమీన్‌రైతు సబ్ ఎడిటర్‌గా పని చేస్తుండేవాడు) "అనుకొన్నట్టులె కాకపోయినను," ఇత్యాది పద్యాలను విశ్లేషిస్తూ `పుట్టినరోజు' విషయాన్ని సూచన ప్రాయంగా ప్రస్తావించాను. ఆయన సాహిత్య సర్వస్వాన్ని ప్రచురించే బాధ్యత తెలుగు

ఆత్రేయ ఆత్మకథాది కృతుల సమీక్షా పరంపర - 3

అకాడమీ స్వీకరించాలన్నాను కూడా.

కళావాచస్పతి కొంగర జగ్గయ్య గారు - తన సంపాదకత్వంలో మనస్విని ట్రస్టు ఆపని చేసినట్టు ఈకాల మిస్టుకు తెలియక పోవడం చిత్రంగా ఉంది అన్నారు; సంపుటాలకు `విశాలాంధ్ర ప్రచురణాలయాన్ని కదిపి చూడమన్నారు. ఈ విషయాన్ని నేను మా ఎడిటర్ దృష్టికి తేగా - నిజమే నంటూ తన వద్దనున్న ఆత్రేయ సాహిత్య సంపుటాలను నాచేతిలో పెట్టాడు. వాటిలో `ఆత్మకథ' లేదు. దాని కోసం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో గాలించి పెదవి విరిచాడాయన; పట్టు విడువక కనిపించిన వారినందరిని యాచించాను. కడకు సువ్వన్నణి తిరుమూరు సుధాకరరెడ్డి పుణ్యాన; `మూలాధారచక్ర'న్నే తప్ప ఆయన మొగమైనా ఎరుగని కావలి జవహర్ భారతి తెలుగు లెక్చరర్ ఆంజనేయులు నాయుడి ధర్మాన `ఆత్మకథ' నా వాస్తగతమైంది. పై ముగ్గురికీ నా కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలు. `పుట్టినరోజు' పద్యాల పొంకం ఎట్లాంటిదో వివరిద్దాం-

పుడమిగాఢాంధకారాన నడగి యుండ
రేపు రాజును ప్రసవింప రేయిపడతి
పురిటి నొప్పులు పడుచుండ,
భూతగణము
చెలగి చెలరేగి తిరుగు నిశీథ మందు
చైత్రమాసాన అమవసన్, జన్మతార
ధరణిగా, ధనుర్లగ్నాన, ధరణికొక్క
కొత్త జీవుడు వచ్చె, నిమిత్తమేమె!
అతనితో లోకమున రెట్టి అవసరమ్మొ!

రవిని కనడానికి రేయిపొలతి
పెదనపడు తున్నది; కవిని ప్రసవించడానికి
తల్లి సీతమ్మ పురిటి నొప్పులు పడుతున్నది.
కవిరవుల జననంలో సామ్యతను చూపడంలో
ఆత్రేయగడుసు దనం తేటతెల్లమే.
అమావాస్యనాడు పుడితే గజదొంగ
అవుతాడన్న లోకోక్తిని కాలదన్ని కవిగజం
అయ్యాడు ఆత్రేయ.

భువికి వచ్చేది ప్రతిపాప దివిజదూత
దివ్య సందేశమేదియో తెమ్మనంట
సరుల మాపాప బాసల నెరుగలేక
తలనిరొసలిము దాని సందేశమేము
పాప మన్నభాష నేర్చితి ప్రాయమునకు
మాలిపోవ; తానెవ్వరో మరచిపోవ

పసి పాపలు పరమాత్మ ప్రతిరూపాలు;
కల్లకపటాలు నేరని కసుగాయలు. పుట్టగానే
ఆ పాప భాష `క్యార' మనే వీళ్ళు. దాని
మర్మం మనకు తెలియదు. మన భాష బిడ్డకు
వొంట బట్టిన తర్వాత తన నైర్మల్యాన్ని
మరచిపోతుంది. లోకమెట్లో వాడట్లా
తీరుతాడు. మన జాడల్లోనే అడుగు లేస్తాడు
- దీనికి మినహాయింపులు క్వా చిత్కం.

ఎట్రి నాడమ్మ పాపడు, ఎంత గొంతు
అబ్బకొడుకని ఖండువుల్ వాస్యమాడ
ఎట్రినాడమ్మ భయము లేదింకయనుమ
మనసు నెమ్మది పడనూర్చె మంత్రసాని.

ఎట్రు జీవలక్షణమట, ఎవ్వరున్న
కొట్టి ఎట్రింతురట బిడ్డపుట్టగానె
ఎంత ఇష్టమె నరజాతి కేడువన్న
అతని ఎట్రున కనలైన అర్థమేమె?

బిడ్డ ఏడ్పుకు అర్థం చెబుతూనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నాడు. బ్రతుకులో కడగళ్లు, కన్నీళ్లుకాక మరేముంది?

దివి విడిచి వచ్చినందుకు దిగులుపడెనొ
జగతి చీకటిగమిగాంచి జడుసుకొనెనొ
శోకసంకుల దీనభూలోకమునని
చిన్ని పాపనిగుండె చెదరెనేమె?

పాప మిషతో శోకాకులమైన లోకాన్ని దెప్పి పొడుస్తున్నాడు. అంత మాత్రమేకాదు - కొంత వేదాంతాన్ని కూడా రంగరించి పద్యాన్ని శృంగారించాడు కూడ. ధని అయినా దరిద్రుడైనా సరే - దుఃఖానికి అతీతుడైన వాడు. ఎవడైనా ఉన్నాడా, ఈ భూమ్మీద? కాకుంటే వేదాంతజ్ఞులన్నట్లు - చేదుమాత్రకు తేనె అంటించినట్లు -

"Pleasure is an interval between two pains" కష్టద్వయం నడుమ నలిగే సుఖం - కాసేపు విరామం - ఊపిరి పోసుకోవడానికి-

లౌకికంగా బిడ్డ ఏడ్పు ఒక తల్లికే ఎరుక అంటాడు క్రింది సీస పద్యంలో-

ఒకసారి పాలిచ్చి యొదార్చు పాపని
మరుసారి ఎందుకో మందుపోయు
ఒకసారి ఊయల లూపి పాడును జోల
మరుసారి గట్టిగా మందలించు
ఒకసారి గారాన నొదలంత ముద్దిడు
మరుసారి తాకిన `మైల' యనును
ఒకసారి నడిపించు నూతగా చేయిచ్చి
మరుసారి నవు ్వను దొరలిపడిన
దిట్టితీయించు వీడతి దుష్టుడనును
`తండ్రికొడు'కను `నా కన్నతండ్రి'
యనును
ఎన్ని అర్థాలో పాపని విడువునదు
ఒక్క తల్లికొ ఎరుక ఈ ఉర్విలోన."

తల్లీ బిడ్డల అనుబంధాన్ని, అనురాగాన్ని బొమ్మకట్టి తీర్చిన పద్యం. దగ్గర తీసినా, దండించినా, తల్లి గుండె నిండా ప్రేమే; స్వార్థం లేని ప్రేమ.

... **అగ్నిమిత్ర**

జిల్లావార్తలు

ఐదవ పేజీ కొరవ

అధికులు వచ్చి జీతం తీసుకొంటున్నారు. `అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని' సామెతను గుర్తు చేస్తూ ప్రక్కనే సోమశిల ప్రాజెక్ట్ వున్నా కాలనీలోని కొళాయిలకు ఒక్క పూట నీళ్లు మాత్రమే వస్తున్నాయి. దీనివల్ల నీరొక కటకట లాడపలసి వస్తున్నది. కాలనీలో కట్టిన ఇళ్లు పూర్తిగా దెబ్బతిని పోయి వాటిలో ఉండలేక పోతున్నామని ఉద్యోగస్తులు లబో దిబో మంటున్నారు. కాలనీకి హైటెన్షన్ విద్యుత్ సరఫరా కావడం కూడా పలు సమస్యలను సృష్టిస్తూన్నది. ప్రతి యేడాది ఎంతో, కొంత బడ్జెట్‌ను ప్రాజెక్ట్‌కు కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపు కొంటున్నది. ఏమిటీ దుర్మార్గం? ఏమిటీ పట్టపగలు దోపిడీ? అధికారులు, వుద్యోగులు ఇంత పచ్చిగా ఖజానాకు చిల్లులు పెడుతుంటే అడిగేవారు, ఆపేవారే లేరా? కలిక్టర్ గారైనా భూ నష్టపరిహారం గోల్మాల్‌పై విచారణ జరపడం అవసరం. అది ఎంత త్వరగా జరిగితే అంత మేలు!

కోవూరు షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి 18 కోట్లు

జిల్లాలో సహకార రంగంలో పనిచేస్తున్న కోవూరు షుగర్ ఫ్యాక్టరీ విస్తరణకు 18 కోట్ల 72 లక్షల రూపాయలను ముఖ్యమంత్రి విడుదల చేసినట్లు మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి చెప్పారు. 28తేది ఏలేకరులతో మాట్లాడుతూ గత 8 సంవత్సరాల నుండి ఫ్యాక్టరీ విస్తరణకై నిధుల విడుదలకు ప్రయత్నిస్తుండగా వివిధ కారణాల వల్ల ఈ పని ముందుకు సాగలేదన్నారు. తాను, కోవూరు, అల్లూరు ఎమ్మెల్యేలు పట్టుపట్టి సంబంధిత అధికారులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి, ముఖ్యమంత్రిని ఒప్పించా మన్నారు. ఈ నిధులతో ప్రస్తుతం ఫ్యాక్టరీకి ఉన్న 16 వందల టన్నుల సామర్థ్యాన్ని 2500 టన్నులకు పెంచవచ్చు. ఈ చర్య వల్ల ఫ్యాక్టరీకి సంవత్సరానికి రెండు కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. ఏప్రిల్ నెలాఖరుకు క్రషింగ్ పూర్తవ్వడం వల్ల రైతుల సమస్యలన్నీ తీరుతాయని మంత్రి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. నేషనల్ రిజర్వు ఫండ్ క్రింద 14వేల కోట్ల రూపాయలుండగా ఎక్కువ శాతం నిధులు మహారాష్ట్ర, గుజరాత్‌లలోని చక్కెర ఫ్యాక్టరీలు తీసుకొంటున్నాయట. ముఖ్యమంత్రి చొరవతో కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి ఈ మేర నిధులు మంజూరైనట్లు మంత్రి వివరించారు. సమావేశంలో చక్కెర ఫ్యాక్టరీ ఎం.డి. టివి.ఎన్. ప్రసాద్ కూడా పాల్గొన్నారు.

అనంతసాగరం

5వ పేజీ కొరవ

శిబిరంలో డాక్టర్లు జి. కృష్ణమూర్తి, ఎం.సి. నరసింహులు, జి.వి. ప్రసాద్ రోగులను పరీక్షిస్తారు. 6తేది ఎంపిక చేసిన వారికి ఆపరేషన్లు చేస్తారు. 10తేది వీరిని డిశ్చార్జి చేస్తారు. ఆపరేషన్ చేయించు కొన్నవారికి కంటి అద్దాలు ఉచితంగా ఇస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

అభ్యుదయ సేవాసంస్థ తృతీయ వార్షికోత్సవం

కావలి అభ్యుదయ సేవా సంస్థ తృతీయ వార్షికోత్సవం ఉగాది పర్వదినాన మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ ఎస్. ప్రభాకరరావు రిటైర్డ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి. వాసుదేవరెడ్డి, సిండికేట్ బ్యాంక్ మేనేజర్ పి. సాంబమూర్తి, పన్‌టౌన్ ఎస్ఐ పి.ఎన్. రాంబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ పి. వెంకట్రావు సభకు అధ్యక్షత వహించారు. సంస్థ



శ్రీ శారదా నికేతన్ సంస్థ నుండి ఉగాది గౌరవ పురస్కారాన్ని స్వీకరిస్తూన్న చక్కిరాల శ్రీనివాసులు

అధ్యక్షుడు సోమా శివయ్య కావలిలోని వివిధ సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు.

అత్యాచార బాధితులకు సహాయం!

జిల్లాలో అత్యాచారాలు జరిగిన కేసులకు సంబంధించి 10 మంది షెడ్యూల్డ్ కులాలు, 5 మంది షెడ్యూల్డు తెగల వారికి 2 లక్షలా 37 వేల రూపాయల సహాయం అందించినట్లు కలెక్టర్ డాక్టర్ సాంబశివరావు చెప్పారు. జిల్లాలో ఇంకా 143 కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్, ఛార్జిషీట్లు, మెడికల్ రిపోర్టులు తన చేతికి అందనందు వల్ల సహాయం అందించ లేకపోయినట్లు తెలిపారు. నివేదికలు పంపితే వారం రోజులలోగా సహాయాన్ని ప్రకటిస్తా మన్నారు. జిల్లా జైలులో వైద్య చికిత్స పొందుతున్న ఖైదీలను మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రులకు తరలించమని సలహా యిచ్చారు. జిల్లా జైలులో డ్రైనేజి పనులు ఇంకా పూర్తి చేయక పోవడం పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులతో 31తేదిన కలెక్టర్ సమీక్షా సమావేశం జరిపారు.

జిల్లాలో బ్యాక్ టు స్కూల్ ప్రోగ్రామ్!

బడి నుండి నిర్బంధమైన పిల్లల కోసం జిల్లాలో బ్యాక్‌టు స్కూల్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. 6 నుంచి 11 సంవత్సరాల మధ్యగల ఇటువంటి పిల్లలు 5 వేల మంది వున్నారని అధికారులు గుర్తించారు. వీరికోసం 50 హాస్టల్లు, బోధనా కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా పుస్తకాలు అందించి భోజన వసతులు కూడా కల్పిస్తారు. ఈ స్కూల్లు ఏప్రిల్ 14 తేది నుంచి జూన్ 14 తేది వరకు పనిచేస్తాయి. ఒక్కొక్క బోధనా కేంద్రంలో 5 మంది ఉపాధ్యాయు లుంటారు; 100 మంది బాల బాలికలకు తిరిగి విద్యా బుద్ధులు నేర్పిస్తారు. పథకం మంచిదే; ఫలితాలే పరిగ్గాలేవు.

మార్కెట్

5వ పేజీ కొరవ

చేస్తున్నట్లు ఇక్కడ పాపులున్న వ్యాపారస్తుల గగ్గోలు. చేపల, మాంసం మార్కెట్లలోని దుర్గంధం వల్ల ప్రజలు వాటిని విస్మరించి వీధుల్లో అక్కడక్కడా వెలసిన చిన్న చిన్న దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. మునిసిపల్ శానిటరీ అధికారులు ఈ పాపుల గూర్చి పట్టించు కోవడం లేదు. మార్కెట్లలో కనీస వసతులు కల్పించి, తాత్కాలిక మరమ్మత్తులు చేపడితే ఇక్కడ పరిస్థితులు మెరుగు పడతాయి.

జమీన్‌రైతు చందా

సంవత్సరచందా	రూ.100లు
ఆరు నెలలకు	రూ.50లు
విడిప్రతి	రూ.2-

నేనేం బదులివ్వాలి?

... బి. మనోహర్

అక్కడ పత్తి విత్తులే అణుబాంబులై
రైతుల గుండెలపై పేలుతూ
జీవితాల్ని ధ్వంసిస్తున్నాయి
పత్తిచెట్లు `విష' నాగులై
ప్రాణాల్ని హరిస్తున్నాయి
నిండుగా వుండాల్సిన రేగడి కాస్త బెండుతేలి
నూరేళ్ల జీవితాల్ని కర్కశంగా కబళిస్తూంది
నేవుని గుడిలో వెలగాల్సిన చూది వత్తులు
రైతు తలపై బంతులై పడుతున్నాయి
రైతే రాజన్న బొంకులాడు లేరి?

ఓట్ల సంబరాల్లో నోట్లు పంచిన కుబేరుల్లారా!
రాజకీయ రక్కసుల్లారా!
వారి ఆక్రందన మీకు వినిపించదా?
ఇప్పుడు వాగ్దానాలు కాదు
ఆదరించి కన్నీటిని తుడిచే మిత్ర హస్తాలు కావాలి
అంతంలేని ఈ ఆత్మహత్యలకు మంగళం పాడాలి
రైతన్నా! వినికిట్లో చీకటిని చూసి, బతికి ఆత్మహత్యలకు తెగించకు
మరొకరిని ప్రేరేపించకు
కారుతున్న నా కన్నీటికి
రేపటి ఉషోదయానికి నేనేమని బదులివ్వాలి?

గౌతమి కడుపుమంట

"మొత్తం మీద మీరు బిజెపి తరఫున చేసిన ప్రచారం వృధాపోలేదు," అంటే - గౌతమి కాస్త సీరియస్‌గా చూస్తూ "కాని, ఏం ప్రయోజనం?" అంది. "అలా అంటారేమిటండీ? కేంద్రంలో బిజెపి ప్రభుత్వం జండా ఎగరేసింది కదా?" అంటే, గౌతమి "అది నిజే... నేనంత కష్టపడి ప్రచారం చేసి నాకేం ప్రయోజనం? కనీసం, మంత్రుల ప్రమాణ స్వీకరణానికైనా నన్ను పిలిచారా? ఆ తర్వాత నా సంగతి వాళ్లెవరూ పట్టించుకోలేదు. నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరులా అయ్యింది? అనవసరంగా రాజకీయాలతో నా చేతులు కలిపాను. ఇప్పుడు బుద్ధొచ్చింది," అంటూ లెంపలు వేసుకుంది.

మళ్లీ మోహన్‌బాబు చిత్రంలో రజనీకాంత్


మోహన్‌బాబు కొత్తగా ప్రారంభించిన "రాయుడు" చిత్రానికి తమిళంలో విజయం సాధించిన "వళ్ళల్" మాతృక అని చెప్పలేదు. కాని, ఆ చిత్రంలో తాను గౌరవ పాత్రధారినని రజనీకాంత్ తెలిపారు. ఇటీవల మోహన్‌బాబు సదా దీర్ఘాలోచనలో నిమగ్నుడైనట్లు కనిపిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హఠాత్తుగా బిజెపికి సన్నిహితుడవడం కారణమేమో?

వైజయంతి ఎంబిబిఎస్

విజయశాంతి నటించిన "కర్తవ్యం" చిత్రం తమిళంలో "వైజయంతి ఐపిఎస్"గా తయారైంది. ఇప్పుడొక తమిళ చిత్రం "వైజయంతి ఎంబిబిఎస్"గా తెలుగులో తయారౌతోంది. విజయశాంతి, రాంకీ, ప్రకాష్‌రాజ్, అశోక్‌కుమార్, జీవాతో పాటు మూడేళ్లపాప శ్రీదేవి ఇందులో నటించింది. సంగీతం: ఇళయరాజా. దర్శకత్వం: కెఆర్. సమర్పణ: ఎం.వి.శ్రీనివాస్.

గవర్నమెంట్

హీరో వినోద్‌కుమార్‌కు ఇప్పుడు తెలుగు చిత్రాలు అట్టేలేవు. ఆయన మాతృభాష కన్నడంలో నటించిన "గవర్నమెంట్" డబ్బింగ్ చిత్రం ఏప్రిల్‌లో మన రాష్ట్రంలో విడుదల కావొచ్చు. దీనిలో నెపోలియన్, రఘువరన్, కాస్ట్యూమ్స్ కృష్ణ, రంజిత, చారులత, రవి నటించారు. దర్శకత్వం: ఓంప్రకాష్.



సూర్యవంశం చిత్రంలో మీనా

కుష్‌బూను ఫోన్‌లో వేధించిన అల్లరి పిల్లలు!

కుష్‌బూ పర్సనల్ ఫోన్ నెంబరు ఆమె సన్నిహితులకు తప్ప మరెవ్వరికీ తెలీదు. దాదాపు రెండు నెలలుగా ప్రతిరాత్రీ 10 గంటల తర్వాత ఆ పర్సనల్ ఫోన్ నెంబరు మోగేది. రిసీవర్‌ను ఆమె చెవి దగ్గర ఉంచుకోగానే "హాయ్ కుష్‌బూ! ఏం చేస్తున్నావ్? ఇప్పుడు ఏ డ్రెస్‌లో వున్నావ్? బెడ్ రూమ్‌లో ఏ భంగిమలో పడుకొని ఉన్నావ్?" వంటి ప్రశ్నలు అడిగేది ఒక పురుష కంఠం. "నోర్ముయ్యరా రాస్కెల్!" అంటూ కుష్‌బూ వెంటనే డిస్కనెక్ట్ చేస్తూండేది. మరోసారి "ఆహా! కోపంలో నీ గొంతు ఎంత మధురంగా ఉంటుందో తెలుసా?" అనే వాడతను. "ఫోన్ పెట్టెయ్యరా బాస్టర్డ్!" అంటూ ఎన్నో సార్లు కుష్‌బూ మండి పడేది. ఒక్కోసారి అతగాడు అసభ్యంగా మాట్లాడే వాడు. కుష్‌బూకు కోపం ఆగింది కాదు. ఆ పీడ ఎలా విరగడ చేసుకోవడం కోసం తన ఇంటి సమీపంగా ఉన్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మళ్లీ అదే రాత్రి ఆమెకు ఫోన్ వచ్చింది. ఈసారు కుష్‌బూ శాంతంగా "మిస్టర్! మీరు ఎవరోగాని నేను కాస్త తగ్గ వలసి వస్తోంది. మీ ఓపికను ఎంతైనా మెచ్చుకోవాలి. నేను ఎంత కోప్పడినా మీరు పట్టించు కోకుండా మళ్లీ ఫోన్ చేస్తున్నందుకు థాంక్స్ చెప్పుకోవాలి. చివరికి మీతో మైత్రి చేయడానికి కుతూహల పడుతున్నాను. నిజం. ఇటుపైన మనం ఫ్రెండ్స్," అంటూ" ఫ్రెండ్! మా ఫ్రెండ్స్ ఇద్దరు వచ్చారు. ఒక పది నిముషాల్లో పంపించేస్తా లెండి. అంచేత, మీరు ఒకపావు గంట ఆగి, వా బెడ్‌రూమ్‌లో ఉన్న సెల్యులర్ ఫోన్‌కు డయల్ చేస్తే, మనం చాలా సేపు మాట్లాడుకోవచ్చు," అంటూ అతనికి తన సెల్యులర్ ఫోన్ నెంబర్ ఇచ్చింది. అలాగే పావు గంట అయ్యిందో లేదో... అతగాడు సెల్యులర్ నెంబర్‌కు ఫోన్ చేశాడు. అప్పుడు అతని ఫోన్ నెంబరు కుష్‌బూ తెలుసుకోగల్గింది. వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం తెల్పి, వారి ద్వారా ఆ ఫోన్ అగంతుడి చిరునామా సంపాదించారు. తర్వాత తను స్వయంగా ఆ ఫోన్ చేసినతని అడ్రస్‌కు బయలు దేరింది... అణ్ణానగర్‌లో ఒక అపార్ట్‌మెంట్‌లో ఇద్దరు కాలేజ్ స్టూడెంట్స్ ఉన్నారు. వారిలో ఆ ఫోన్ చేసిన వాడెవడో తెలిపోగానే, "రాస్కెల్! నిన్ను పోలీస్‌కు పట్టిస్తాను," అంటూ అతని షర్ట్ కాలర్ కుష్‌బూ పట్టుకుంది. "సారీ, మేడమ్. వా మీద ఏ చర్యా తీసుకోబాకండి. నేను చేసింది పెద్ద పొరబాటే," అంటూ ఆ స్టూడెంట్ ఆమె రెండు కాళ్లూ పట్టుకున్నాడు. దానితో ఆమె జాలిపడి అతన్ని పోలీస్‌లకు అప్పగించకుండా వదిలేసింది. కాని, టెలిఫోన్ డివిజనల్ మేనేజరుకు ఫిర్యాదు చేయడంతో ఆ ఫ్లాట్‌లో ఉన్న టెలిఫోన్ కనెక్షన్ తీసేయబడింది. *

మాత్రాసు సినిమా వార్తలు

అసభ్యంగా వుందని మధ్యలో డ్యాన్స్ ఆపేసిన హీరా!

"సుందర పాండ్యన్" అనే తమిళ చిత్రంలో హీరా పాల్గొన్న ఒక డాన్స్ చిత్రీకరణ జరుగుతోంది. కాసేపయ్యాక ఆమె, "ఈపాట అసభ్యంగా ఉంది. ఇంత ఛండాలంగా రాసిన పాటకు డాన్స్ చేయడానికి ఎవరైనా సెక్స్ డాన్సర్‌ను బుక్ చేసుకోవచ్చు కదా? నేనెందుకు? ఈ డాన్స్ నేను చేయను," అంటూ భీష్మించుకు కూర్చుంది. తమిళం తెలియని ఆమెకు ఆ పాటకు అర్థాన్ని ఎవరు వివరించారని దర్శకుడు, నిర్మాత ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. హీరో అజిత్ అయి ఉంటాడని వాళ్ల భావన. ఇంతకీ ఆ పాట ఎలా ఉందంటే-

"కుహూ కుహూ కోకిలా...
రాత్రి ఏమిటే ఈ ఎండ తీక్షణం?
కొవ్వొత్తి వెలుగులో
కేక్‌ను కట్ చేసి తేసుకురా...
చిక్కిపోతే సిక్సర్ కొట్టొద్దాం."

తెలుగు చిత్రంలో కన్నడ హీరో!

తెలుగులో నటుల కొరత ఉన్నట్లు కన్నడ నటుడు ఉపేంద్ర ఒక తెలుగు చిత్రంలో హీరోగా నటించడంతో పాటు దర్శకత్వం కూడావహించ బోతున్నారు. "ఒక హీరో శ్రీకాంత్, ఇంకో హీరో పాత్ర చాలా కీలకమైనది. అందుకే తెలుగు ప్రేక్షకులకు ఉపేంద్రను పరిచయం చేయదలిచాను. ఒక నాయిక రచన. మరో నాయిక, ఇతర పాత్రధారులెవరో త్వరలోనే తెలియజేస్తాను," అన్నారు ఇవి. "ఓం" చిత్రాన్ని డైరక్ట్ చేసిన ఉపేంద్ర, హీరోగా కనిపించే 'A' చిత్రం త్వరలో విడుదలవబోతూంది.

మొగుడు మళ్లీ పుట్టాడు

కన్నడం నుంచి ఇప్పుడు ఎక్కువగా తెలుగు చిత్రాలు దిగుమతి చేయబడుతున్నాయి. కన్నడ హాస్య నటుడు, దర్శకుడు ద్వారకీష్ కన్నడ చిత్రంతోపాటు తెలుగు వెర్షన్ "మొగుడు మళ్లీ పుట్టాడు" తయారు చేస్తున్నాడు. సౌందర్య, సురేష్, సుధాకర్, మన్సూర్ ఆలీఖాన్, విజయకుమార్ ఈ చిత్రంలో నటిస్తారు. జూన్‌లో షూటింగ్ పూర్తవు తుందట.

మీ ఆయన జాగ్రత్త!

ఏప్రిల్‌లో విడుదల చేయాలను కుంటున్నాం, అన్నారు ముత్యాల రాందాసు. ఈయన దర్శకత్వం నెరపిన "మీ ఆయన జాగ్రత్త" చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, రోజా, బ్రహ్మానందం, రక్ష, కోట శ్రీనివాస రావు, బాబూమోహన్, ఎవిఎస్, శివాజీరాజా, లతాశ్రీ, వల్లభనేని జనార్ధన్ నటించారు. మాటలు మరుధూరి రాజా, సంగీతం వినాయక్.

మావిడాకులు-చూడదగిన మంచి సినిమా!

ఈ చిత్రం పేరు రెండు అర్థాల నిస్తుంది. ఒకటి శుభం, రెండవది అశుభం. మొదటిది మామిడి ఆకులు. పెళ్లిళ్లు వంటి శుభ కార్యాల్లో గుమ్మాలకు మామిడాకుల తోరణాలు కట్టారు. ఇక రెండవ అర్థం భార్యా, భర్తలు అభిప్రాయ భేధాలతో, వివాదాల తుఫానులతో మామిడాకుల మంగళ ప్రదాన్ని తుంగలో తొక్కి విడిపోవడానికి తీసుకునే విడాకులు. ఈ రెండు అర్థాలనూ ఈ చిత్రం చర్చిస్తుంది.

రమణి, ఇవివి, సత్యనారాయణ కూర్చిన కథలో కొత్త దనం వుంది. ఈ కథకు దర్శకుడు కొత్త అంశాలను చేర్చి కథనాన్ని సహజత్వం నిండిన జీవన సంఘటనలతో నడిపాడు. తన ప్రతి చిత్రంలోనూ సెంటిమెంటుకు, వినోదానికి, నాటకీయతకు ప్రాధాన్యత నిచ్చి ఒక కొత్త పద్ధతిలో వాటికి దృశ్య రూపం కల్పించే దర్శకుడు ఇవివి. సత్యనారాయణ ఈ చిత్రంలోనూ వాటికి బలమైన భూమిక ఏర్పరచాడు.

విడాకులతో విడిపోయిన రెండు దాంపత్య జీవితాల ఆధారంగా కథ సాగుతుంది. ఒక దాంపత్యం ప్రతాప్ (జగపతిబాబు), కీర్తి (నీలమ్)లది. రెండవది ముద్దు కృష్ణ (రవి), ప్రియ (రచన)లది. ప్రతాప్ టివి ఛానల్లో పని చేస్తుంటాడు. ఆంకుస భార్య కీర్తి హఠాత్తుగా పనిచేస్తుంటుంది. తన అందచందాలతో మిస్ ఇండియా స్థానం సంపాదించాలన్నది ఆమె జీవితాశయం. తన ఆశయానికి సంసారబంధం అడ్డంకిగా తోచి ప్రతాప్‌కు విడాకులిస్తుంది. తరువాత కీర్తి మిస్ ఇండియాగా ఎన్నికై తన జీవితాశయాన్ని నెరవేర్చు కొంటుంది. తన కూతురు పప్పిని (బేబీ ఉపాసన) భర్త వద్ద వదిలేస్తుంది.

ముద్దుకృష్ణ శ్రీమంతుడైన తన యజమాని భార్యతో సంబంధం పెట్టుకొని,

చిత్రసమీక్ష

గిద్దలూరు గోపాలరావు

ప్రియను నిర్లక్ష్యం చెయ్యటంతో - అది సహించలేని ప్రియ ముద్దుకృష్ణకు విడాకులిస్తుంది. తన కుమారుడు బబ్లూను (మాస్టర్ ఆనంద వర్ధన్) తన పెంపకంలో వుంచుకుంటుంది. విడాకులు పుచ్చుకున్న ప్రియ ఒక ప్రైవేటు టివి ఛానల్లో పని చేస్తుంది.

వేరు వేరు ప్రైవేటు టివి ఛానల్స్‌లో పనిచేస్తున్న ప్రతాప్, ప్రియలు అనుకోకుండా టివి కార్యక్రమాలను ఆకర్షణీయంగా నిర్వహించటంలో పోటి పడతారు. ప్రతాప్ కూతురు పప్పి, ప్రియకుమారుడు బబ్లూన్ ఒకే బడిలో చదువుకుంటూ స్నేహితులవుతారు. ఒకానొక సందర్భంలో ప్రతాప్, ప్రియలు పప్పి, బబ్లూన్‌లకు తల్లిదండ్రులుగా వ్యవహరించ వలసి వస్తుంది. ఆ సన్నివేశం ప్రతాప్, ప్రియలను దగ్గరకు చేరుస్తుంది. ఇలా చేరువకు వచ్చిన ఆ ఇద్దరూ ఒకరి విడాకుల జీవితాలు మరొకరు విన్నవించు కుంటారు. ఇది ఫ్లాష్‌బ్యాక్‌లో చూపబడు తుంది.

కీర్తి తండ్రి (కోట శ్రీనివాసరావు) తన కూతురు మూలంగా విడాకులకు గురైన ప్రతాప్ మీద జాలిదలచి అతనికి మళ్లీ పెళ్లి చెయ్యాలను కుంటాడు. తన మిత్రుడి (బ్రహ్మానందం) సహాయంతో అమ్మాయి కోసం అన్వేషణ సాగిస్తాడు. ప్రియ తగిన అమ్మాయి అని నిర్ణయించు కుంటారు. అప్పటికే పరిచయం ఏర్పరచు కొనివున్న ప్రతాప్, ప్రియలను ఒక ఇంటివారిని చెయ్యాలని నిర్ణయించు కుంటారు. అయితే ప్రతాప్, ప్రియలు తమ పరిచయం పెళ్లిగా మారటానికి ఇష్టపడరు. వారిద్దరినీ పెళ్లికి ఒప్పించేందుకు వారి పిల్లలను వారిమీదికి ప్రయోగిస్తాడు కీర్తి తండ్రి. ప్రతాప్, ప్రియలు పెళ్లికి అంగీకరిస్తారు.

తరువాయి 11వ పేజీలో

వారఫలాలు

తేది 4.4.98 నుండి 10.4.98 వరకు మేషంలో కుజుడు; మిథున, కర్కాటక, సింహ, కన్యలలో చంద్రుడు; సింహంలో రాహువు; కుంభంలో శని, గురు, శుక్రులు; మీనంలో రవి, శని, బుధులు.

మేషం

(అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం)

కొన్ని అనుకొని సంఘటనలు జరగటం; పిల్లల వల్ల ఖర్చులు పెరగటం, కుటుంబ వ్యక్తుల మధ్య అభిప్రాయ భేదాలు కలగడం, వారాంతంలో ఆరోగ్య లోపం ఉంటుంది. పిల్లల శుభ కార్య ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపార వృద్ధి, కొత్త అగ్రిమెంట్లు జరుప ప్రోత్సాహం ఉంటుంది.

వృషభం

(కృత్తిక. 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2పాదాలు)

వృత్తి, వ్యాపార, ఉద్యోగ జీవనం గలవారికి ఆదాయం, ఆర్థిక స్థితి బాగుంటుంది. వ్యవసాయ దారులకు చేయూత లభిస్తుంది. ప్రయత్నించి చేస్తున్న పనులు నెరవేరే సూచనలు ఉన్నాయి. కుటుంబ సభ్యులకు కొద్ది ఆరోగ్య లోపం. కొత్తగా పెట్టుబడులుగాని, సంస్థలలో భాగస్వామ్యంగాని లభిస్తుంది. శ్రమ ఎక్కువగా ఉంటుంది. అధికారులతో విభేదాలు రాకుండా జాగ్రత్త పడండి.

మిథునం

(మృగశిర. 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

బంధు మిత్రుల రాకపోకలు, అధికారులతో సన్నిహితంగా మెలగడం పనులందు అనుకూలత ఉంటుంది. వృత్తి, వ్యాపార, వ్యవసాయ జీవనం గలవారికి రాబడి బాగుంటుంది. ఇతరుల పనుల్లో సహాయం పలుకుబడి ఉపయోగిస్తారు. కుటుంబ సమస్యలు, ఉద్యోగ సమస్యలు పరిష్కారం కాగల అవకాశాలు వస్తాయి.

కర్కాటకం

(పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేషలు)

వృత్తి, వ్యాపార, వ్యవసాయ జీవనం గలవారికి ఆదాయం బాగుంటుంది. కాని ఒక్కో పర్యాయం సమయానికి డబ్బు చేతిలో లేక ఇబ్బంది పడతారు. అదనపు ఖర్చులు పెట్టవలసి వస్తుంది. అధికారుల ఆదరణ, తోడ్పాటు, పనులందు అనుకూలత బాగుంటుంది. ప్రయాణాలు, సత్కర్మలలో పాల్గొనడం జరుగుతుంది.

సింహం

(మఖ; పుబ్బ; ఉత్తర 1వ పాదం)

వృత్తి, వ్యాపార జీవనం గలవారికి రాబడి, ఆర్థికస్థితి బాగుంటుంది. ప్రతి పనిలో ఆందోళన ఆలోచన ఎక్కువగా ఉంటుంది. అధికారుల సహాయ సహకారాలు ఉద్యోగులకు లభిస్తాయి. వార ప్రారంభంలో ఆరోగ్యం సరిగా ఉండదు. మిమ్ములను కించ పరిచే సన్నివేశాలు ఎదురు కాగలవు. మంచి పనులలో చేయి కలుపుతారు.

కన్య

(ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త; చిత్ర 1,2 పాదాలు)

కుటుంబ సభ్యులతో విభేదాలు, కుటుంబ వ్యక్తుల అనారోగ్యం, అనుకొనని అదనపు ఖర్చులు, ఆరోగ్య లోపం ఈ వారంలో మీ బాధలు. ఆశించినంత ఆదాయం వుండదు. ఆర్థిక వత్తిడి, మంచి పనులలో పాల్గొనడం ఉంటుంది. ఇంటా బయటా మీ ప్రయత్నాలకు ఆటంకాలు ఉంటాయి. కొత్త పెట్టుబడులకు బాగా ఆలోచించి దిగండి. బంధుమిత్రుల క్షేమ వార్తలు వింటారు.

పంచాంగం

పండుగలు

5తేది ఆదివారం శ్రీరామనవమి
8తేది బుధవారం బక్రీద్
9తేది గురువారం మహావీర జయంతి

ముహూర్తాలు

10తేది శుక్రవారం ఉదయం 8.38 గం.లకు వృషభ లగ్నాన ఉపనయన, వివాహ, వ్యాపారారంభాలకు సుముహూర్తాలున్నాయి.

ఏప్రిల్ తిథులు

చైత్రశుద్ధ

తేది 4	శని	అష్టమి	రా.గ	6.41వ
తేది 5	ఆది	నవమి	రా.గ	6.55వ
తేది 6	సోమ	దశమి	రా.గ	6.56వ
తేది 7	మంగళ	ఏకాదశి	రా.గ.	7.33వ
తేది 8	బుధ	ద్వాదశి	రా.గ.	8.50వ
తేది 9	గురు	త్రయోదశి	రా.గ.	10.28వ
తేది 10	శుక్ర	చతుర్దశి	రా.గ	12.28వ

స్వయంపాకుల శ్రీనివాసులు

తుల

(చిత్ర 3,4పాదాలు, స్వాతి, విశాఖ1, 2, 3 పాదాలు)

వృత్తి, వ్యాపారాలందు అభివృద్ధి, ఆదాయం ఉండును. ఉద్యోగులు అదనపు బాధ్యత నిర్వర్తించుటగాని, మార్పులుగాని ఉండును. అనుకోని అదనపు ఖర్చులు, వారాంతంలో కొద్ది ఆరోగ్య లోపం, తండ్రి వర్గ బంధువులకు అనారోగ్యం, ఆర్థికపరంగా కాని, కుటుంబ పరంగా కాని కొన్ని గట్టి నిర్ణయాలు జరుగవచ్చును. బిడ్డల వల్ల ఆస్తి నష్టంగాని, ధన వ్యయంగాని జరుగును.

వృశ్చికం

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వార ప్రారంభంలో కొంత ఆర్థిక వత్తిడి పెరుగును. ఆరోగ్యం కూడా సరిగా ఉండదు. మంచి పనులందు పాల్గొనుట, అనుకొనని ప్రయాణాలు, కుటుంబ సౌఖ్యం బాగుండును. స్వంతపనులు అనుకూలించును. ఇతరులకు మాట రూపంలోగాని డబ్బు రూపంలోగాని సహాయ పడవలసి రావచ్చు.

ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

ఈ రాశి వారికి ఆర్థికంగా బాగుండును. పలుకుబడి కొరకు కొంత ఖర్చు పెట్టవలసి వచ్చును. కుటుంబ సౌఖ్యం, పిల్లల విద్యావృద్ధి, శుభ కార్యానుకూలత ఉండును. అధికారుల తోడ్పాటుతో పనులు సాధించుకొనుట, మాట నేర్పరితనం బాగుండును.

మకరం

(ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1,2 పాదాలు)

ఇంటా బయటా మీ ప్రయత్నాలు అనూనాలిస్తాయి. ఆరోగ్యం సరిగా ఉండదు. బంధుమిత్రుల వార్తలు అందుతాయి. స్థిరాస్తుల కొనుగోలు, కొత్త పెట్టుబడులకు ప్రయత్నాలు జరుగులపై పత్కార్యాలలో పాల్గొంటారు. గౌరవ ప్రతిష్ఠలు బాగుంటాయి. ఉద్యోగులు కార్య నిర్వహణలో జాగ్రత్త పడండి. అపత్యం పలకడం తప్పదు.

కుంభం

(ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు)

ఆర్థికస్థితి ఆదాయం బాగుంటుంది. చేస్తున్న పనులు కొన్ని సందేహాస్పదమై ఆందోళన కలిగిస్తాయి. ఉదరకోశ రుగ్మతలు కలుగవచ్చు. కుటుంబ సభ్యులతో చిన్న తగాదాలు, కుటుంబ వ్యక్తులకు కొద్ది అనారోగ్యం కలుగవచ్చును. ఇతరులు తమ పనుల్లో మీ మీద పత్తిడి తెస్తారు. పిల్లల విద్యా, వివాహ ప్రయత్నాలు అనుకూలించును. ఉద్యోగులకు శ్రమ, పని బాధ్యతలు పెరుగుతాయి.

మీనం

(పూర్వాభాద్ర 4పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

తొందరపాటు నిర్ణయాలు; పనులకు ఆటంకాలు, కొద్దిపాటి అనారోగ్యం ఈవారంలో ఎదురు కాగలవు. అనుకొనని అదనపు ఖర్చులు, ఇతరుల కొరకు ప్రయాణాలు పిల్లల వల్ల ఖర్చులు పెరగడం జరుగుతుంది. కుటుంబ సభ్యులకు అనారోగ్య బాధలు ఉండును. కొత్త కొత్త వార్తలు వింటారు.

జనవాణి

మూడవ పేజీ కోరవ

10 నంది అవార్డులు రావడం ఆనందకరం. అన్నమయ్య చిత్రాన్ని పలువురు తీయాలని సంకల్పించినా అది సాధ్యపడ లేదు. సంగీతపరమైన ఈ చిత్రాన్ని దర్శకుడు రాఘవేంద్ర రావు తన సహజ ధోరణులు పక్కనపెట్టి రసరమ్యంగా తెర కెక్కించారు. హీరో నాగార్జున విమర్శకుల నోళ్లు కట్టి పడేసేలా నటించి అక్కినేని వంశపు కీర్తిని ఇనుమడింప జేశారు. చక్కని కథ తయారు చేసిన జి.కె. భారవికి, చిత్రాన్ని అవార్డుకు ఎంపిక చేసిన కమిటీకి ప్రత్యేక అభినందనలు.

నెల్లూరు జె. పోలిరెడ్డి

స్పీకర్ల పనితీరును వేలెత్తి చూపకూడదు

పూర్వం లోక్‌సభ, రాష్ట్ర శాసన సభలకు పనిచేసిన స్పీకర్లను తప్పుపట్టే ధైర్యం ఎవరికీ ఉండేదికాదు. అంత హుందాగా సభను నిర్వహించేవారు. లోక్‌సభ స్పీకర్లుగా పనిచేసిన మౌలంకర్, అనంతశయ్యం అయ్యంగార్, అయ్యదేవర కాశేశ్వరరావు ఆ పదవికి ఎనలేని పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టారు. ఇటీవల ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్ రాష్ట్రాల శాసన సభల్లో స్పీకర్లు వ్యవహరిస్తున్న తీరు, ఇస్తున్న రూలింగులను చూస్తుంటే నోటమాట రావడం లేదు. వీరు తీసుకొంటున్న నిర్ణయాల వల్ల సభ కొన్ని సమయాల్లో అదుపు తప్పి పోతున్నది. స్పీకర్లుగా పనిచేసే వ్యక్తులు ఒకసారి తమకున్న విశిష్ట అధికారాలను గుర్తెరిగి ప్రవర్తించాలి. తమ పనితీరును ఏ ఒక్కరూ వేలెత్తి చూపలేని విధంగా దాన్ని మెరుగు పరచుకోవాలి.

తోటపల్లి గూడూరు జి. శేఖర్

ఏమిటీ గందర గోళం

ధృక్ సిద్ధాంతం ప్రకారం ఈయేడు మార్చి 28తేది ఉగాది చేసుకొన్నవారు, ఆగష్టు 26తేది వినాయక చవితి కూడా చేసుకోవాలి. వసాతన సిద్ధాంతం ప్రకారం ఈనెల 29తేది ఉగాది పండుగను చేసుకొన్నవారు, ఆగష్టు 25తేది వినాయక చవితి నిర్వహించాలి. కాని ఈ రెండు శాస్త్రాలూ తెలిసిన పండితులు ఈ పద్ధతి ప్రకారం పండుగల తేదీలు ప్రకటించకుండా, వారి వారి ఇష్టానుసారం ప్రకటించి ప్రజలను గందరగోళ పరుస్తున్నారు. ఈ విధంగా చేయడం శాస్త్రాన్ని, విజ్ఞానాన్ని, సరస్వతీ దేవిని అవమానించడమే. భుక్తి కోసం ఈ విధమైన మోసానికి పాల్పడ వద్దని మనవి.

బుచ్చిరెడ్డిపాళెం వి.వి. మోహనకృష్ణ

మన సంస్కృతికి తగదు

నెల్లూరు పెద్దింటి మహిళలు కొందరు చీట్లాడుతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకొన్నట్లు ఒక్క `జమీన్‌రైతు' పత్రికలో మాత్రమే ధైర్యంగా వ్రాశారు. మహిళలు వేలాది రూపాయలు కాని వారి నుంచి డబ్బు పెట్టి చీట్లాడడం మన సంస్కృతికి పూర్తిగా విరుద్ధం. వీరిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు నిలబెట్టి వుంటేపోలీస్ పరువు నిలబడేది. డబ్బులు తీసుకొని వదలి వేయడంతో పోలీసు పరువు పెన్నలో కలిసి పోయింది.

నెల్లూరు ఎ. శేషారెడ్డి

త్యాగరాజ స్మరణోత్సవాలు

ఈనెల 18తేది నుంచి 24తేది వరకు నెల్లూరులో జరిగిన త్యాగరాజ స్మరణ సంగీత కచ్చేరీలు శ్రోతలను అలరించాయి. గాయకులు సంతాన గోపాలన్, శ్రీమతి నిత్యశ్రీ, కుంభమణి, నీల, కె. లలిత పోటా పోటీగా పాడి, సంగీత ప్రియులను తమ గానామృతంతో ఓలలాడింప జేశారు.

నెల్లూరు ఆర్. వరలక్ష్మి

యాభై ఏళ్ల క్రితం

మూడవ పేజీ కొరవ

"కాంగ్రెస్ నేడు స్వతంత్ర సముపార్జనకు పూర్వముండిన తన స్వభావాన్ని పోగొట్టుకొని స్వతంత్ర శక్తుల సమ్మేళనంగా కాక, ఒక రాజకీయ పార్టీగా, ఒక పెట్టుబడి దారీ వర్గ సంరక్షక సంస్థగా తయారైంది. ఢిల్లీలో ఆమోదించిన కాంగ్రెస్ నూత్న నియమావళి కూడా కాంగ్రెస్ యొక్క ఈ స్వభావాన్ని స్థిరీకరించింది. అటువంటప్పుడు సోషలిస్టులు తమ ప్రత్యేక కార్యక్రమాలతో కాంగ్రెస్‌లో ఉండటం చిక్కులకు దారి తీస్తుంది.

"అంతే గాకుండా భారత దేశాన్ని ప్రజాస్వామికంగా తయారు చేయనడుం గట్టి ఉన్నప్పుడు, ఏక పార్టీ పరిపాలన ఏతన్మూల సూత్రాలకు విరుద్ధం. కాబట్టి ప్రభుత్వ విధానాలను నిస్పాక్షికంగా, నిర్దాక్షిణ్యంగా అరమరలు లేక విమర్శించే ప్రతి పక్షం అవసరం. అటువంటి ప్రతి పక్షం ఉన్నప్పుడే ప్రభుత్వ విధానం అభ్యుదయ కారకంగా ఉండే వీలు ఉంటుంది. కాబట్టి అటువంటి ప్రతిపక్షం కొరత తీర్చేందుకు సోషలిస్టు పార్టీ పూనుకొన్న"దని జయప్రకాష్ అన్నారు.

నెల్లూరు ముచ్చట్లు

కమ్యూనిస్టుల హరారు

1.4.48తేది అల్లూరులో కమ్యూనిస్టు నాయకులను అరెస్టు చేయుటకు పోలీసులు పోగా, ఐస్వారెడ్డి శంకరయ్య, అల్లూరు రంగయ్య హరారు చిత్తగించారట. పోదామే కొన్ని పుస్తకాలు కాగితాలు పట్టుకొన్నట్లు వార్త.

ఆనాడు

ఆంధ్ర మెడికల్ మహాసభల సందర్భంలో నెల్లూరు లలిత కళా నిలయం వారు 28తేది "ఆనాడు" నాటకం ప్రదర్శించారు.

కథ మతపిచ్చిని రెచ్చగొట్టేదిగా ఉంది. ఈ దినాల్లో ప్రజలకు కావలసింది `ఆనాడు' కాదు - "ఈనాడు".

పల్లెటూళ్లు

అల్లీపురం

ఓ పంచాయతీ బోర్డా? సిగ్గు జాస్తయిందమ్మా? గ్రంథాలయాన్ని అధ్యక్షుడు ఇంట్లో పెట్టి ఎవ్వరికీ ప్రవేశం లేకుండా చేశావటమ్మా? కాస్త కాలాన్ని బట్టిపో- ఒక సూడెంటు

* * *

జమీన్‌రైతు చందా

సంవత్సరచందా	రూ.100లు
ఆరు నెలలకు	రూ.50లు
విడిప్రతి	రూ.2-

SENIOR CIVIL JUDGE COURT, KAVALI

S.C. No. 57/97

Sri Venkateswara Traders, rep. by its Proprietor Beggam Balarami Reddy ... Plaintiff

Vs.

Vattigunta Balakrishna ... Defendant

Order 5 Rule 1 C.P.C.

Suit Notice

TO : Vattigunta Balakrishna, Kondapuram (Vil., PO., & Mandal), Nellore Dist. అనువారికి

ఈ నంబరున వాది కంపెనీ లెక్క బాకీ తాలూకు పుస్తకం ప్రకారం రూ.5,441/- బాకీ అయి వున్నందున సదరు బాకీ నిమిత్తం వాది నీ మీద దావా వేసి యున్నందున నీకుగల ఆక్షేపణలు తెలుపుకొనుటకు కోర్టువారు 9.4.98 తేదికి వాయిదా వేసియున్నారు. వాయిదా రోజు ఉదయం 10 గంటలకు పై కోర్టున హాజరై నీకు గల ఆక్షేపణలు తెలుప వలయును. లేని యెడల నీ పరోక్షముగా తీర్మానించబడును.

యం.వి. నారాయణ, BA.,BL., వాది అడ్వకేటు, కావలి

[illegible]
బిస్కట్
హోల్‌సేల్‌గా
లభించును
విజయ
వక్కపొడి
ట్రంకురోడ్డు, నెల్లూరు
ఫోన్: 323372

మంత్రి పదవులు

మొదటి పేజీ తరువ

పదవులు ఇవ్వకూడ దన్నది! ఈ పరతు విషయంలో చంద్రబాబు చాలా కఠినంగా వ్యవహరించాడని అభిజ్ఞ వర్గాల భోగట్టా!

సాధారణ పరిస్థితులలో బిజెపి ప్రభుత్వంలో శ్రీ ఎం. వెంకయ్య నాయుడు కీలక మంత్రి పదవి పొందివుండాలి. గత రెండు మూడేళ్లుగా జాతీయ రాజకీయాలలో చాలా ప్రాముఖ్యత సంపాదించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఎన్నికల కోఆర్డినేటర్‌గా, పార్టీ స్పోక్స్‌మన్‌గా ఢిల్లీలో స్థిరపడ్డారు. ఆయన్ను మంత్రిని చేయడం కోసమే కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎంపిక చేశారు. వాజపేయికి, అద్వానికి వెంకయ్య నాయుడు చాలా సన్నిహితుడు. ఇన్ని అర్హతలుండి కూడా కేంద్ర మంత్రిత్వం ఆయన చేతికి అందక పోవడానికి కారణం చంద్రబాబు పెట్టిన నియమమే!

వెంకయ్య నాయుడు కేంద్ర మంత్రి అయితే రాష్ట్రంలో స్థితిమంతులైన కమ్మ కులానికి చెందిన ఎమ్మెల్యేలు, రాజకీయ వాదులు ఆయన చుట్టూ గుమి కూడతారని చంద్రబాబు భయం. రాష్ట్రంలో వ్యాపార పరంగా, రాజకీయంగా ఎంతో పలుకుబడి సంతరించుకున్న ఈ వర్గానికి ఇప్పటి వరకు చంద్రబాబు ఒక్కడే పెద్దదిక్కుగా వున్నాడు. ఆ గౌరవం తన నుంచి తప్పు కుంటుందన్న భయంతోపాటు - వెంకయ్య నాయుడు తన ఎమ్పాలు, ఎమ్మెల్యేలను బిజెపిలోకి తీసుకువెళ్లి పోతాడేమోనన్న సందేహమూ ముఖ్యమంత్రిని పట్టి పీడిస్తున్నది! పైగా వెంకయ్య నాయుడికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. వారి ద్వారా ఆయన తెలుగుదేశం పార్టీని ప్రభావితం చేయవచ్చునన్నది అనుమానం! ఈ ప్రమాదాలు తప్పించు కోవడానికే చంద్రబాబు ఆ షరతు విధించారు. ఇదే షరతు డాక్టరు దగ్గుపాటి వెంకటేశ్వరరావుకు సైతం వర్తిస్తున్న దిప్పుడు. బిజెపి ప్రభుత్వంలో మంత్రిత్వ అవకాశం కల్గిన మరొక కమ్మ కుల పెద్ద ఆయన.

వెంకటేశ్వరరావుతో చంద్రబాబుకు దాయాది పోరు వుంది. కాని వెంకయ్య నాయుడు ఆయన శ్రేయోభిలాషి. ఎన్టీఆర్ మరణించి నప్పుడు ఆయన శవం దగ్గర ఆయన సంతానమంతా చేరి చంద్రబాబును అవమానించే పరిస్థితిలో వెంకయ్య నాయుడు జోక్యం చేసుకొని, వారికి నచ్చ చెప్పి, చంద్రబాబు పరువు కాపాడారు. నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటుతో అధికారం కోల్పోయి అవాధవలె మిగిలిన ఎన్టీఆర్‌ను రాష్ట్రమంతా తిప్పి, ఒక ఉద్యమం లేవదీసి, తెలుగుదేశం పార్టీకి ప్రాణప్రతిష్ట చేసిన వాడు వెంకయ్య నాయుడు. ఆపదలో ఆయన చేసిన సహాయాలే చంద్రబాబుకు ఇప్పుడు గుర్తుకు రాలేదు. తన మామను, బావమరుదులను, తోడల్లుడ్ని, యునైటెడ్ ఫ్రంట్‌ను దగా చేసినట్లే ఇప్పుడు వెంకయ్య నాయుడినీ ఈ రీతిలో వెన్నుపోటు పొడిచాడు.

బాబూఖాన్ రాజీనామా
ఢిల్లీ మంత్రిత్వాలుబంద్

రాష్ట్ర పరిశ్రమల మంత్రి బాబూఖాన్ రాజీనామా తెలుగుదేశం పార్టీకి రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బ అనే చెప్పాలి. కేంద్రంలో బిజెపి సర్కారుకు మద్దతు ఇచ్చిరండుకు నిరసనగా బాబూఖాన్ తన పదవికి రాజీనామా చేశారు. పార్టీలో ఆయనకు పలుకుబడి, ఆయన్ను అనుసరించి వెళ్లి పట్ల రాష్ట్రంలోని ముస్లిం జనాభాతో శత్రుత్వ భావం పెరగడానికి ఈ రాజీనామా ఉపకరిస్తుంది. తాను బిజెపికి ఓటు వేసినందువల్ల ముస్లింలలో నిరసన ఏస్తుందన్న సంగతి చంద్రబాబుకు తెలుసు. అయితే నెమ్మదిగా నచ్చచెప్పి, ఆ వ్యతిరేకతను సమసింప జేయవచ్చునన్న ధైర్యంతో ఆ నిర్ణయం తీసుకొన్నా రాయన. కానీ తన మంత్రి వర్గంలోనే తిరుగుబాటు రావడంతో బిత్తర పోయాడు. బాబూఖాన్ చేత రాజీనామా ఉపసంహరింప చేయడానికి ఎన్ని విధాలుగానో ప్రయత్నించినా ఫలితం రాలేదు. బాబూఖాన్ చాలా నిర్మొగమాటంగా ముఖ్యమంత్రి లాలనకు తిరస్కరించారు. ఒక్క హైదరాబాద్ సిటీలోనే కాక తెలంగాణా జిల్లాల ముస్లిం వర్గాలలో బాబూఖాన్ కుటుంబ పట్ల అభిమానం వుంది.

వాజపేయి మంత్రి వర్గంలో తెలుగుదేశం సభ్యులను చేర్పించాలన్న చంద్రబాబు ప్రయత్నానికి ఈ రాజీనామాతో బ్రేక్ పడిపోయింది. నిజానికి ఎవరెవరిని మంత్రి వర్గంలోకి తీసుకోవాలి, ఏఏ శాఖలు ఇవ్వాలి అన్న విషయం కూడా వాజపేయితో చర్చించి, రెడీ చేసిపెట్టి వుండినారు. పార్లమెంట్ సమావేశాలు ముగియగానే మంత్రి వర్గ విస్తరణ జరగ వలసి వుండింది. తన పార్టీతో పాటుగా, కాశ్మీర్‌కు చెందిన నేషనల్ కాన్ఫరెన్స్ సభ్యులనూ మంత్రి వర్గంలోకి రప్పించేందుకు చంద్రబాబు కృషి చేశాడు. ఫరూఖ్ కుమారుడ్ని కేంద్ర మంత్రిగా చేస్తే - ముస్లింలలో తన పట్ల అభ్యంతరం వుండదన్న మాష్టర్ ప్లాన్ రచించా రాయన. బాబూఖాన్ పుణ్యాన ఆ అవకాశం చేజారింది.

నెల్లూరు సంగతులు

4వ పేజీ తరువ

సూర్యనారాయణ, భీమా సంస్థ సహాయ సంచాలకులు ఎం. వేణుగోపాలరావు, హుజూర్ శిరస్తదార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు

పదవ ఆర్థిక ప్రణాళిక నిధుల క్రింద జిల్లాకు విడుదలైన నిధుల్లో, 3కోట్ల 11 లక్షల 19వేల 664 రూపాయలను జిల్లాలోని అన్ని పంచాయతీలకు విడుదల చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి చెప్పారు. ఈ నిధులను 1991 సంవత్సరం జనాభా లెక్కలను అనుసరించి మనిషికి 16 రూపాయల వంతున విడుదల చేశారట. ఈనిధులతో పంచాయతీల్లో సిమెంటుతో పక్కా మురుగునీటి కాలువల నిర్మాణం; తారు, సిమెంటు, కంకర రోడ్లు వేయించుకోవచ్చు. బోర్లు, బావుల నిర్మాణం కూడా చేపట్ట వచ్చున్నారు. ఈ పనులన్నీ సర్పంచుల అధ్యక్షతతో కూడిన గ్రామాభివృద్ధి కమిటీలు చేపట్టాలని పంచాయతీ అధికారి సూచించారు. నిధుల లేమితో పంచాయతీల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన వుంది. ఈ నిధులతోనైనా కాసింత అభివృద్ధి కనపడితే అదే పదివేలు!

ఉగాది వేడుకలు

నెల్లూరు వర్ధమాన సమాజం యాజమాన్యాన టౌన్‌హాల్‌లో బహుధాన్య సంవత్సర ఉగాది వేడుకలు 29 తేది ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డివి. సుబ్బారావు నిర్వహించిన రసవన్మధుర గాత్ర కచేరి సభికులను రసావర్తంలో ముంచెత్తింది.



ఉగాది వేడుకలలో పాల్గొన్న కవి పండితులతో వర్ధమాన సమాజం అధ్యక్ష, కార్యదర్శులు పివి. రమణారెడ్డి, పాన్నాల రామసుబ్బారెడ్డి, అగస్తురెడ్డి వెంకురెడ్డి

శాస్త్రోపన్యాసకులు చింతలపాటి పూర్ణానంద శాస్త్రి వివరణాత్మక, విశ్లేషణాత్మక పంచాంగ శ్రవణం సభికుల్లో ఆసక్తిని రేపింది. కవి మోనా నేతృత్వంలో జరిగిన కవి సమ్మేళనంలో గుడి నారాయణబాబు, శ్రీమతి ఇరుగంటి కమలమ్మ, ఊరుచిండి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, చిరంజీవి, పెరుగు రామకృష్ణ పాయసం సుబ్రహ్మణ్యం, రత్నయ్య చౌదరి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. మాజీ మునిసిపల్ కౌన్సిలర్ బి. గంగాధరరెడ్డి, నారాయణ విద్యా సంస్థల అధిపతి పి. నారాయణ కవులను సత్కరించారు.

అవోపా ఉగాది వేడుకలు

ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ మరియు మహిళా విభాగ్ వారు నవాబుపేటలోని కామిశెట్టి సుందరరామయ్య శెట్టి సత్రంలో ఉగాది వేడుకలు జరిపారు. పండితులు స్వయంపాకుల శ్రీనివాసులు పంచాంగ శ్రవణం గావించి బహుధాన్య సంవత్సర ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా బోక్స్ పోటీలను నిర్వహించారు. పచ్చిపులుసు వెంకటేశ్వర్లు, బివి. నరసింహం ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మెంటా నరసింహారావు, కెఎస్. గుప్త పర్యవేక్షించారు. 400 మంది సంఘ సభ్యులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు.

శారదా సాహితీ సంస్థ ఉగాది పురస్కారాలు

శారదా సాహితీ సంస్థ రాయాజి వీధిలోని అంజనేయ స్వామి దేవస్థానంలో ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణం, పండితులకు సన్మాన కార్యక్రమం నిర్వహించింది. చింతలపాటి పూర్ణానందశాస్త్రి, చక్కిరాల శ్రీనివాసులు, రంగస్థల నటులు హరగోపాల్, జర్నలిస్ట్ పత్తి సుబ్బారావులను సంస్థ నిర్వాహకులు బి. సీతారామశాస్త్రి సన్మానించారు.

న్యాయవాదుల గుమస్తా సంఘాల ఎన్నికలు

నెల్లూరు న్యాయవాదుల గుమస్తాల సంఘం సర్వసభ్య సమావేశం మార్చి 26తేది నెల్లూరులో జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. అధ్యక్షునిగా జి. సత్యనారాయణ, ఉపాధ్యక్షునిగా ఎ. ప్రసాదరావు, కార్యదర్శిగా ఎ. సత్యనారాయణ, కోశాధికారిగా డి. వెంకటరత్నం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వి. మల్లికార్జునరావు, వి. శంకరరావు, షేక్. అల్లాబక్షు, ఎ. బాబు రావు, ఎస్వీ ఉమాశంకర్‌లను కూడా నియమించారు.

* * *

చిత్రసమీక్ష

9వ పేజీ తరువ

ప్రతాప్‌తో విడాకులు పుచ్చుకున్న కీర్తి మిస్ ఇండియా కిరీటం పొందినా, ఆ కీర్తి ప్రతిష్టలు తన ఒంటరి తనంలోని బాధను తొలగించ లేకపోయాయని ఆవేదన చెందుతుంది. ఎన్ని పెను తుఫానులు వచ్చినా ఏ భార్యా, ఏ భర్త తమ దాంపత్య జీవితాన్ని విడాకుల పేర విచ్ఛిన్నం చేసుకోకూడదన్న నగ్న సత్యం కీర్తికి కనువిప్పు కలిగిస్తుంది.

ప్రతాప్, ముద్దుకృష్ణ, ప్రియ, కీర్తి పాత్రలను సెంటిమెంటు ప్రధానంగా మంచి నాటకీయతతో దర్శకుడు తీర్చి దిద్దాడు. ఆ నాలుగు పాత్రల గుండెలోతుల్లోంచి స్వయం కృతాపరాధం వల్ల జీవితాలు చీకటి కావటం, ఆ జీవితాల చీకటి కోణాల నుంచి చీల్చుకు వెలువడ్డ బాధ, ఆవేదనల సన్నివేశాలను హృద్యంగా చూపాడు దర్శకుడు. కోట శ్రీనివాసరావు, బ్రహ్మానందం పాత్రలు ప్రతాప్‌కు పెళ్లి సంబంధాలు వెతికే సందర్భాల్లో మంచి హాస్యం అందించాయి. ఎం.ఎస్. నారాయణ పాత్ర కూడా హాస్యానికి దోహదపడింది.

జగపతిబాబు, రవి హీరో పాత్రల్లో గొప్పగా నటించారు. రచన హీరోయిన్‌గా నిలదొక్కుగోగలిగింది. నీలమ్ మోడల్ గరల్‌గా, విడాకులు పుచ్చుకొని ఆవల హ్యాత్తాప పడిన సన్నివేశాల్లో మంచి నటన చూపింది. పసి పిల్లలు బేబీ ఉపాసనీ, మాస్టర్ ఆనందవర్ధన్ నటన ముచ్చటగా, మెచ్చుకో తగిందిగా వుంది.

జనార్ధన మహర్షి మాటలు, కోటి సంగీతం చిత్రం విలువను పెంచాయి. చోటా కె. నాయుడు కెమరా గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆకర్షించే పేరు, ఆకట్టుకునే కథా కథనం ప్రత్యేక శైలి ఆవిష్కరించుకొన్న దర్శకత్వంతో చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటూ వుంది.

సుబ్బరామిరెడ్డి

2వ పేజీ తరువ

అది జరిగితే తప్ప పారిశ్రామికాభివృద్ధి సాధ్యం కాదు.

అదే సమయంలో ప్రస్తుతం వున్న పరిశ్రమలు ఖాయిలా పడకుండా కాపాడాలి. 8వేల కోట్లు వెచ్చించి నిర్మించిన విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మూతపడే పరిస్థితిలో వుంది. దాన్ని పునరుజ్జీవింప జేయడానికి ప్రయత్నించాలి. అధికారులలో రెడ్‌టేపిజం పారిశ్రామికులకు ప్రధాన సమస్యగా వుంది. దాన్ని నిర్మూలించాలి.

శ్రద్ధ చూపించాలి. అవి బాగుపడితేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

గత ఆర్థిక మంత్రి చిదంబరం ప్రవేశపెట్టిన పన్నుల విధానాన్ని కదిలించవద్దని డాక్టర్ సుబ్బరామిరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దేశీయ చెరకు రైతాంగాన్ని దెబ్బతీసే చక్కెర దిగుమతులు తక్షణం నిలపాలని ఆయన కోరారు.

బిజినెస్ న్యూస్

2వ పేజీ తరువ

వంటివి. మన దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభాన్ని ఈ వాహనాల అమ్మకాలు చాలా బాగా ప్రతి ఫలింప జేస్తున్నాయి. ఒల్కో కంపెనీ తయారు చేసే లారీలు, ఇతర వాహనాల అమ్మకం 97-98లో 42శాతం తగ్గిపోయింది. అశోక్ లేలాండ్ అమ్మకాలు 27శాతం క్షీణించాయి. అయితే ఆర్థిక పరిస్థితి నిరాశజనకంగా వున్నప్పటికీ మారుతి కార్ల విక్రయం 7శాతం పెరగడం విచిత్రం. ఈ ఏడాది వారు 3లక్షలా 42వేలా 826 కార్లు అమ్మారు. మారుతి ఎస్టీమ్, మారుతి 1000 కార్ల అమ్మకం మాత్రం 20 శాతం తగ్గింది. హీరో హోండాది మరీ ప్రశంసనీయ అభివృద్ధి. వారు తమ అమ్మకాలను 54శాతం మేర పెంచుకొన్నారు. ఎల్ఎంఎల్ స్కూటర్ల సేల్స్ 13శాతం; టివిఎస్ స్కూటర్ల విక్రయాలు 30శాతం పెరిగాయి. అదే సమయంలో బజాజ్ స్కూటర్ల అమ్మకాలు 12శాతం, మోపెడ్లు 28శాతం పడిపోయాయి.

పెట్రోలులో ఆదా

ఈ ఏడాది పెట్రోలు దిగుమతుల విషయంలో వూహించనంత పొదుపు సాధ్యపడింది. 1997 ఆగస్ట్ నుంచి 1998 మార్చి మధ్యలో దాదాపు పదివేల కోట్ల రూపాయల ఆదా సాధ్యమైంది. అంతర్జాతీయంగా పెట్రోలు ధరలు పతనం కావడమే దీనికి కారణం. 1990 నాటి ధరలో పెట్రోలు లభిస్తున్నదిప్పుడు. కాని దురదృష్టవశాత్తు దేశం లోపల ప్రజలు మాత్రం పెరిగిన ధరలకే పెట్రోలు కొనుగోలు చేయవలసి వస్తుంది.

ఖాళీస్థలం అమ్మబడును

నెల్లూరు లక్ష్మీపురంలో షుమారు 60 అంకణాల ఖాళీ స్థలం అమ్మబడును

వివరములకు
ఫోన్ : 323795
323796

నెల్లూరు మూలాపేట శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవములు

కృష్ణం కమల పత్రాక్షం శ్రవణ కీర్తనం
వాసుదేవ జగత్కర్వం నౌమి నారాయణం హరిం



6.4.98 నుండి 18.4.98 వరకు

సాంస్కృతిక కార్యక్రమములు

తేది	కార్యక్రమం
07-4-98	సింహపురి ఆర్కెస్ట్రా, పాటూరు శ్రీనివాసులు, సంతపేట, నెల్లూరు వారిచే 'పాటకచ్చేరి'
08-4-98	1) శ్రీమతి రాళ్లపల్లి సుబ్బలక్ష్మి, గాయత్రి, శ్రీ అత్రా కృష్ణమూర్తి గార్లచే భక్తి గీతాలాపము 2) శ్రీ విఘ్నేశ్వర నృత్య నికేతన్ బాల బాలికలచే నృత్య ప్రదర్శన
09-4-98	1) గాత్ర కచ్చేరి 2) శ్రీ పల్లవి ఆర్కెస్ట్రా వారిచే పాట కచ్చేరి
10-4-98	శ్రీమతి ఉమా ముద్దుబాల బృందము తిరుపతి వారిచే నృత్య ప్రదర్శనలు
11-4-98	1) శ్రీ వాణి శైలజచే సంగీత కచ్చేరి 2) బాల బాలికలు కూచిపూడి నృత్య ప్రదర్శన
12-4-98	1) మనవ్య గాత్రము 2) 7 లెటర్స్ ఆర్కెస్ట్రా వారిచే పాట కచ్చేరి
13-4-98	1) కిన్నెర అఖిల (సినీ చైల్డ్ ఆర్టిస్ట్) రికార్డు డ్యాన్స్ 2) అన్నమాచార్య కీర్తనలు 3) మురళీ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ నెల్లూరు వారిచే హాస్య వల్లరి
14-4-98	1) వయోలిన్ కచ్చేరి 2) "బాలనాగమ్మ" నాటక ప్రదర్శన
15-4-98	పాట కచ్చేరి
16-4-98	"అన్నమయ్య" నాటకము
17-4-98	1) భరతనాట్యం చాచా ప్రదర్శన 2) "చింతామణి" నాటకము
18-4-98	రసమంజరి వారిచేనాటకములు ప్రదర్శించబడును.

గమనిక: *ప్రతిరోజూ శ్రీ స్వామివారి ఉత్సవములు ఉదయం 8-30 గంటలకు సాయంత్రం 7-00 గంటలకు బయలుదేరును*

తేది	వారం	ఉదయం	ఉభయకర్తలు	రాత్రి	ఉభయకర్తలు
6.4.98	సోమవారం			అంకురార్పణ	కీ.శే. దొంతంశెట్టి రాధాకృష్ణయ్య జ్ఞాపకార్థం మోడరన్ స్టోర్స్, నెల్లూరు
7.4.98	మంగళవారం	ధ్వజారోహణము	లేట్ టి. సుందరరామిరెడ్డి గారి జ్ఞాపకార్థం భార్య సుగుణమ్మ, నెల్లూరు	శేష వాహనము (నెల్లూరు ఉత్సవము)	కీ.శే. వీరాశెట్టి నాగరాజు గారి జ్ఞాపకార్థం శ్రీమతి వీరాశెట్టి నరసమ్మ అండ్ సన్సు వారు పెద్దబజారు, నెల్లూరు
8.4.98	బుధవారం	సూర్యప్రభ	శ్రీవై. కృష్ణార్జునరెడ్డి, లెక్చరరు SVGSకాలేజి, నెల్లూరు, శ్రీమతి రమాదేవి	హంసవాహనము (పేట ఉత్సవము)	శ్రీగండవరపు లక్ష్మినారాయణరెడ్డి కస్తూరిదేవి హైస్కూలు ఎదురుగా, నెల్లూరు
9.4.98	గురువారం	యాళి ఉత్సవం (సింహ వాహనము)	శ్రీడి. భాస్కర్, ప్రొ.భాస్కర్ పెయింట్స్ సంతపేట, నెల్లూరు	చంద్రప్రభ (నెల్లూరు ఉత్సవము)	కీ.శే. యిస్కా వెంకమ్మగారి జ్ఞాపకార్థం మనుమడు డా. యిస్కా విజయకుమార్‌రెడ్డి MBBS., నెల్లూరు
10.4.98	శుక్రవారం	చప్పరము	శ్రీసి. పిచ్చిరెడ్డి మల్లిఖార్జున ఫైనాన్స్, పొగతోట నెల్లూరు	వెండి హనుమంతసేవ (నెల్లూరు ఉత్సవము)	స్వర్గీయ శ్రీమాగుంట రాఘవరెడ్డి, స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి గార్ల జ్ఞాపకార్థం శ్రీ మాగుంట సుధాకర్‌రెడ్డి శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి
11.4.98	శనివారం	మోహిని (గిన్నె భిక్ష)	శ్రీ పలగాటి చంద్రశేఖరరెడ్డి వహబ్‌పేట, నెల్లూరు	గరుడసేవ (నెల్లూరు ఉత్సవము) మూలవరులకు పూలంగిసేవ	శ్రీమతి దొడ్ల శంకరమ్మ భర్త దొడ్ల శేషారెడ్డి గారు, రామమూర్తినగర్, నెల్లూరు ఎన్.ఎస్.వి. కిరణ్‌కుమార్ ప్రొ. శ్రీవెంకటేశ్వర హార్డ్‌వేర్ మరియు పెయింట్స్ కంపెనీ, సంతపేట, నెల్లూరు
12.4.98	ఆదివారం			కళ్యాణము ఏనుగ వాహనము (పేట ఉత్సవము)	కీ.శే. శ్రీ సూరా వెంకటరెడ్డిగారి దాన పత్రము ప్రకారం మరియు శ్రీమతి అనిత, శ్రీ సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి, సరస్వతి నగర్, నెల్లూరు
13.4.98	సోమవారం	రథం	స్వర్గీయ నూకల శీతమ్మగారి వీలునామా ప్రకారం కీ.శే. పేటేటి సుబ్బరాయులు శ్రేష్ఠిగారి జ్ఞాపకార్థం చిన్నబజారు, నెల్లూరు		
14.4.98	మంగళవారము	వెన్నెతాళి ఉత్సవం	కీ.శే. దర్శి గుర్నాథం గారి జ్ఞాపకార్థం భార్య వెంకట సుబ్బమ్మగారు మూలాపేట, నెల్లూరు	గుర్రము వాహనము (పేట ఉత్సవము)	శ్రీ పి. మాలకొండారెడ్డి శివప్రియ ఫైనాన్సియర్స్ పొగతోట, నెల్లూరు
15.4.98	బుధవారం	తీర్థవాధి ముసుగుల సేవ	శ్రీఎం. ఆదినారాయణమూర్తి వాసు బుక్ డిపో, నెల్లూరు	పొన్నవాహనము (నెల్లూరు ఉత్సవము)	శ్రీ గుండా ఆంజనేయులు అండ్ సన్స్ కిర్సీ సామానుల వ్యాపారము, 16/559 నర్తకి థియేటర్ ఎదురువీధి, నెల్లూరు
16.4.98	గురువారం			అవరోహణం	శ్రీ సన్నపరెడ్డి పెద వెంకటరెడ్డి నిటి మెడికల్స్, నెల్లూరు
17.4.98	శుక్రవారం			వడాయత్-1	
18.4.98	శనివారం			వడాయత్-2	

దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు

ఆనం చంద్రశేఖర రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ

ఆనం వివేకానందరెడ్డి ట్రస్టీ | మన్నెం లక్ష్మీనాథ రెడ్డి ట్రస్టీ | తుమ్మల సుబ్బారెడ్డి ట్రస్టీ | మర్రిగ చంద్రమౌళిరెడ్డి ట్రస్టీ | ఎ. విద్యార్థి మేనేజరు

Edited, Printed and Published by N. Dolendra Prasad at Zaminryot Press. Offset Printing at Aruna Graphics, Nellore